Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 224 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 సెప్టెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## ఈ నెల 8న మోదీ-బైడెన్ ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వచ్చే వారం న్యూఢిల్లీ రాబోతున్నారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న ఆయన ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ వివరాలను శ్వేత సౌధం శనివారం ప్రకటించింది. జీ20 సదస్సుకు భారత దేశం అధ్యక్షత వహిస్తోంది. ఈ సమావేశాలు న్యూఢిల్లీలో ఈ నెల 9, 10 తేదీల్లో జరుగుతాయి. వైట్ హౌస్ శనివారం విడుదల చేసిన ప్రటకనలో, జో బైడెన్ జీ20 నేతల సమావేశంలో పాల్గొనేందుకు ఈ నెల 7న బయల్దేరుతారని తెలిపింది. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బైడెన్ ప్రశంసిస్తారని తెలిపింది. మోదీతో ఈ నెల 8న ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని తెలిపింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల ఏర్పడే ఆర్థిక, సాంఘిక ప్రభావాన్ని తగ్గించడంపై చర్చిస్తారని పేర్కొంది.





# ఇస్రో ఆదిత్య ఎల్-1 ప్రయోగం

# గ్రాండ్ సక్సెస్

## మరో మైలురాయిని దాటేసిన ఇస్రో



శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో.. మరో మైలురాయిని దాటేసింది. చంద్రయాన్-3 చరిత్రాత్మక విజయం ఇచ్చిన జోష్‌తో సూర్యుడిపై తొలి ప్రయోగం చేపట్టింది. సూర్యుడిపై పరిశోధనల క్రమంలో ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని నింగిలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో శ్రీహరి కోట షార్‌లో శాస్త్రవేత్తల సంబురాలు చేసుకుంటున్నారు. ఇస్రో ఆదిత్య ఎల్-1 ప్రయోగం సక్సెస్ అయ్యిందని, నిర్దేశిత కక్ష్యలోకి ఉప్రగహాన్ని పీఎస్ఎల్వీ ప్రవేశపెట్టిందని, వాహన నౌక నుంచి ఉపగ్రహం విడిపోయిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. సూర్యుడిపై ఇస్రో తొలి మిషన్ ఆదిత్య ఎల్-1. పీఎస్ఎల్‌వీ సీ-57 రాకెట్ ద్వారా ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహం సోలార్ స్మార్ట్స్‌ను అధ్యయనం చేస్తుంది. ఆదిత్య ఎల్-1ను భూదిగువన కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆపై దీర్ఘవృత్తాకార కక్ష్యలోకి దింపారు. ఇక ఇక్కడి నుంచి లాంగ్‌రేంజ్ పాయింట్ 1 వైపు పయనిస్తుంది ఉపగ్రహం. ఈ క్రమంలో.. భూగురుత్వాకర్షణ ప్రభావ ప్రాంతాన్ని దాటి వెళ్తుంది. అనంతరం క్రూజ్ దశ ప్రారంభం అవుతుంది. భూమి నుంచి నాలుగు నెలలపాటు.. దాదాపు 125 రోజులపాటు 15 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది సోలార్ మిషన్. అక్కడ ఎల్1 పాయింట్‌కు చేరుకుని.. సోలార్ కరోనల్ మాస్ ఎజెక్షన్స్‌ను తోలుగా అధ్యయనం చేస్తుంది ఆదిత్య ఎల్ 1. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం? బరువు 1475 కిలోలు. ఉపగ్రహ జీవిత కాలం ఐదేళ్లకు పైనేనని ఇస్రో ప్రకటించింది. ఈ ఐదేళ్లలో.. సౌర తుఫానులు, జ్వాలలు, తీరు తెన్నులపై పరిశోధనలు నిర్వహిస్తుంది. ప్రతీరోజూ 1440 ఫొటోలు తీసి భూమికి పంపడంతో పాటు.. ఫిబ్రవరి నెలాఖరు నుంచి రెగ్యులర్‌గా డేటా అందిస్తుంది ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం. రూ. 378 కోట్లతో ప్రయోగించిన ఈ మిషన్.. నాలుగు నెలలపాటు ప్రయాణించి దాదాపు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రేజ్ పాయింట్ (ఎల్ 1) వద్దకు చేరుకోనుంది. అనంతరం సూర్యుడిపై ప్రయోగాలు చేయనుంది.

**ఏడు పేలోడ్స్...** సూర్యుడిపై ఇస్రో తొలి మిషన్ ఆదిత్య ఎల్-1. ఇందులో 7 పేలోడ్స్ ఉన్నాయి. ఇవి సూర్యుడి పొరలైన ఫొటో స్పియర్, క్రోమో స్పియర్ సహా వెలుపల ఉండే కరోనానూ అధ్యయనం చేస్తాయి. షార్ నుంచి చేసిన ప్రయోగాల్లో ఇది 92వది. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 59వది. ఆదిత్య-ఎల్1 నిర్దేశిత కక్ష్యలోకి చేరిన వెంటనే అందులో అమర్చిన విజిబుల్ లైన్ కొరోనాగ్రాఫ్(వీఈఎల్‌సీ) పేలోడ్ నిమిషానికి ఒకటి చొప్పున రోజుకు సుమారు 1,440 చిత్రాలను తీసి విశ్లేషణ కోసం గ్రౌండ్ స్టేషన్‌కు పంపుతుందని ప్రాజెక్టు సైంటిస్ట్ అండ్ ఆపరేషన్ మేనేజర్ డాక్టర్ ముత్తు ప్రియాల్ చెప్పారు. ఫిబ్రవరి చివరినాటికి మొదటి చిత్రం అందుతుందని భావిస్తున్నామన్నారు.

# తండ్రికొడుకులకు బిగ్ షాకిచ్చేలా బీజేపీ ప్లానింగ్!


హైదరాబాద్ : డ్యామేజ్ కంట్రోల్ దిశగా బీజేపీ ప్లాన్ చేస్తోంది. తెలంగాణ అధికారపక్షంలో తెర వెనుక చేతులు కలిపి.. కాంగ్రెస్ ను అధికారంలోకి రాకుండా ఉండేందుకు వీలుగా ఒప్పందం చేసుకున్నారన్న ప్రచారం తెలంగాణలో కమలనాథులకు కరెంటు షాక్ మాదిరి తగిలింది. మొన్నటివరకు ఉరిమే ఉత్సాహంతో ఉన్న ఆ పార్టీ ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీంతో.. దిద్దుబాటు చర్యలకు అధినాయకత్వం సిద్ధమవుతున్నట్లుగా చెబుతున్నారు. తమపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని.. అవన్నీ అబద్ధాలుగా పేర్కొంటూ కొత్త ఎత్తులకు కసరత్తు చేస్తున్నారు. గులాబీ బాస్ కేసీఆర్ తో తమకున్నది అసలైన రాజకీయ వైరం అన్న విషయాన్ని ప్రూవ్ చేసేందుకు.. వచ్చే ఎన్నికల్లో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైనట్లుగా సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ దళానికి దిమ్మ తిరిగేలా వర్కువుట్ చేస్తున్నట్లుగా సంకేతాలు బయటకు పంపుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి కేటీఆర్ తో పాటు.. గులాబీ బాస్ మేనల్లుడు హరీశ్ రావులతో సహా ముగ్గురు ముఖ్యుల్ని ఎన్నికల్లో ఓడించటమే లక్ష్యంగా కొత్త ఎత్తు వేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇందులో భాగంగా ఈ ముగ్గురి మీదా బలమైన అభ్యర్థుల్ని బరిలోకి దింపాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ.. సుడి తిరిగి గెలిస్తే సంచలనంగా మారుతుందని.. తేడా కొట్టి తమ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయితే.. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో వారిని ఎంపీస్థానాలకు పోటీ చేయించేలా ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్ మీద ఈటల రాజేందర్.. ధర్మపురి అర్వింద్ ను పోటీకి పెట్టాలన్న యోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తాను గజ్వేల్ నుంచి కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నట్లుగా వెల్లడించిన నేపథ్యంలో.. గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్ ను.. కామారెడ్డి నుంచి అర్వింద్ ను బరిలోకి దింపనున్నట్లుగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు పార్టీలో జరుగుతున్నట్లు సమాచారం. దీనికి తగ్గట్లే గతంలోనూ ఈటల పలు సందర్భాల్లో తాను వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మీద పోటీ చేస్తానని ప్రకటించటం తెలిసిందే. ఇక.. మంత్రి కేటీఆర్ మీద కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ను బరిలోకి దింపాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. మరో మంత్రి హరీశ్ రావుపైన బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన మురళీధరరావును.. మహబూబ్ నగర్ లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మీద పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను.. మంత్రి సబిత మీద మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. వనపర్తిలో మంత్రి నిరంజన్ మీద మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి.. కరీంనగర్ లో



గంగుల కమలాకర్ మీద మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డిని.. నిర్మల్ లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డిని బరిలోకి దించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. మిగిలిన మంత్రుల మీదా బలమైన అభ్యర్థుల్ని బరిలోకి దింపటం ద్వారా తమ మీద జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్న విషయాన్ని స్పష్టం చేయాలన్నదే లక్ష్యమంటున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

## భాజపా నాయకులకు మాటలు ఎక్కువ చేతలు తక్కువ: హరీశ్‌రావు

కొల్లూరు: భాజపా నేతలకు మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. వారి మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు మాత్రం గడపలు దాటవని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరులో లబ్ధిదారులకు 2 పడకగదుల ఇళ్లను మంత్రి పంపిణీ చేశారు. విలువైన స్థలంలో, ధనవంతులు ఉండే ప్రాంతంలో పేద ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రూ.60 లక్షల విలువైన ఇల్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెందుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ నలుమూలలా లక్ష రెండు పడక గదుల ఇళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల వద్ద ఆసుపత్రి, రేషన్ షాప్‌తోపాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. అన్ని మతాలను గౌరవించేలా నివాస సముదాయంలో ఆలయంతోపాటు చర్చి, మసీదు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. అలాగే ఫంక్షన్ హాల్ కూడా నిర్మిస్తామని చెప్పారు. భారాస సర్కార్ అంటే.. మాటలు తక్కువ పనులు ఎక్కువ అని అన్నారు. ఇప్పుడు మంచినీళ్లకు ధర్నాల వంటివి లేవని, తాగునీటి సరఫరా చక్కగా జరుగుతుందని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాజపా నాయకులు ఎన్నో చెప్పారని, ఇల్లుపోతే ఇల్లు, బండిపోతే బండి ఇస్తామని మంటూ అబద్ధపు హామీలు ఇచ్చారని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఎక్కడైనా రెండు పడక గదుల ఇల్లు ఇచ్చిందా? అని హరీశ్ ప్రశ్నించారు. భాజపాది డబుల్ ఇంజన్ కాదని ట్రబుల్ ఇంజిన్ అని ఎద్దేవా చేశారు. ఇల్లు ఇస్తానంటూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు.




# ముదురుతున్న మల్కాజ్‌గిరి పంచాయితీ!?

## బీఆర్ఎస్ రేసులో మంత్రి అల్లుడు, మాజీ ఎమ్మెల్యే కోడలు

## కాంగ్రెస్ టికెట్‌కు నందికంటి దరఖాస్తు - దరఖాస్తుల స్వీకరణ దశలో బీజేపీ !

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం చర్చనీయాంశమైంది. మంత్రి హరీశ్‌రావుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కిన బీఆర్ఎస్ సిటింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విషయంలో అధిష్ఠానం ఆలోచించి అడుగులు వేస్తోంది. ఆయన్ను సస్పెండ్ చేయాలని పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ మంత్రి కేటీఆర్ నగరానికి వచ్చిన తర్వాతే ఏదోక నిర్ణయం తీసుకోనున్నారు. మైనంపల్లిని సస్పెండ్ చేస్తే కాంగ్రెస్ పార్టీలోకి వెళతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే మైనంపల్లితో కాంగ్రెస్ సీనియర్ నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. బీఆర్ఎస్ అధిష్ఠానం మైనంపల్లికే టికెట్ ప్రకటించినప్పటికీ మంత్రి కేటీఆర్ నిర్ణయం ఆధారంగా చర్యలు ఉంటాయని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. బీజేపీ కూడా దరఖాస్తుల స్వీకరణకు సన్నద్ధమవుతోంది. దీంతో మల్కాజిగిరి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అధికార పార్టీ నుంచి ఎవరు నిలబడుతారో.. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎవరు కలబడుతారోనని స్థానికంగా చర్చ మొదలైంది.

**కాంగ్రెస్ నుంచి నందికంటి శ్రీధర్ :** కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని కోరుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సురేష్ యాదవ్ కూడా దరఖాస్తు చేసుకున్నప్పటికీ శ్రీధర్ వైపే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మొగ్గ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మైనంపల్లిపై వేటు పడితే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఖరారు చేసే అవకాశం కూడా ఉందనే చర్చ జరుగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుకే టికెట్ దాదాపు ఖరారు అయ్యిందనే ప్రచారం ఊపందుకున్నది. ఆయనతోపాటు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, కార్పొరేటర్ శ్రావణ్‌తో పాటు అధిష్ఠానం అవకాశమిస్తే పోటీ చేస్తామని నాయకులు జీకే హనుమంతరావు, బీజేవైఎం కోశాధికారి సాయిప్రసాద్ పేర్కొంటున్నారు.

**తెరపైకి మరో ఇద్దరు..** బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును సస్పెండ్ చేస్తే పోటీ చేయడానికి కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివంగత చింతల కనకారెడ్డి కోడలు, కార్పొరేటర్ శాంతిశ్రీనివాసరెడ్డి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మహిళల కోటా కింద శాంతిశ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వాలనే ఆలోచనతో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి కేటీఆర్ నగరానికి వచ్చిన తర్వాత ప్రగతిభవన్‌లో ఆశావహులు కలిసి టికెట్ కేటాయించాలని కోరే అవకాశం కనిపిస్తోంది. 2018లో జరిగిన ఎన్నికల్లో మైనంపల్లి హనుమంతరావు బీజేపీ అభ్యర్థిపై దాదాపు 74 వేల మెజార్టీతో విజయం సాధించారు.

# సంపాదకీయం

## ఉద్యోగుల పీఎఫ్.. కొత్త నిబంధనల గురించి తెలుసా?

ఉద్యోగుల భవిష్య నిధి (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్) చందాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలను ఈపీఎఫ్‌వో ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో తాజాగా మరికొన్ని కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఉద్యోగుల వ్యక్తిగత వివరాలను వేగంగా సరిచేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు.. డేటా బేస్ లో ఉన్న పీఎఫ్ చందాదారుడి వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తులో ఉన్న వివరాలు సరిపోకపోతే పీఎఫ్ క్లెయిమ్ చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పేరు, తండ్రి పేరు, నామినీ వంటి విషయాల్లో ప్రధానంగా సమస్యలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యక్తిగత వివరాల్లో మార్పుల కోసం దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా దరఖాస్తు కేటగిరీ ఆధారంగా చిన్న సవరణల్ని వారం రోజుల్లో పరిష్కరించాలని ఈపీఎఫ్‌వో గడువు విధించింది. అదేవిధంగా పెద్ద సవరణల్ని 15 రోజుల్లోగా పరిష్కరించాలని సూచించింది. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసిన మార్గదర్శకాలను ఈపీఎఫ్‌వోకు అమలు చేస్తూ ఈ-కేవైసీని అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే చందాదారుడు కూడా వ్యక్తిగత వివరాలను ఒకటి కన్నా ఎక్కువసార్లు మార్చడానికి వీల్లేకుండా నిబంధనలు విధించింది. వ్యక్తిగత వివరాల్లో సవరణల పేరిట అక్రమాలను నియంత్రించేందుకు ఈ కొత్త విధానాన్ని ఈపీఎఫ్‌వో అందుబాటులోకి తెచ్చింది. ఈపీఎఫ్ ఖాతాలో వ్యక్తిగత వివరాల సవరణ కోసం చందాదారులు ప్రతిరోజూ ప్రాంతీయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మొదటిసారి అప్లై చేసుకునేప్పుడు దరఖాస్తుల్లోని వివరాలు డేటాబేస్ లో సరిగా నమోదు చేయకపోవడం, ప్రస్తుతం యూఏఎన్ లోని వివరాలు సరిపోలకపోవడంతో పీఎఫ్ క్లెయిమ్‌లు తిరస్కారానికి గురవుతున్నాయి. ఇలా డేటాబేస్ లో తప్పులు ఉండటంతో పీఎఫ్ ఖాతా నుంచి నగదు తీసుకోవాలన్నా, పదవీ విరమణ తరువాత నగదు డ్రా చేయాలన్నా, చివరకు పింఛను కోసం దరఖాస్తు చేయాలన్నా ఏదో ఒక కారణంతో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో తమ వ్యక్తిగత వివరాల సవరణ కోసం ఉద్యోగులు సంబంధిత కంపెనీ యజమానితో సంతకం చేయించి.. ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయాల్లో అందజేస్తున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులపై ఈపీఎఫ్‌వో వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. దరఖాస్తుల పరిష్కారానికి కచ్చితమైన గడువు లేకపోవడంతో చందాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి కొత్త విధానాన్ని ఈపీఎఫ్‌వో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానంలో చందాదారుల పేరు, స్త్రీ/పురుషుడు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు, బంధుత్వం, వివాహ స్థితి, చందాదారులుగా చేరిన తేదీ, ఉద్యోగం వదిలిపెట్టడానికి కారణం, ఉద్యోగం వదిలిపెట్టిన తేదీ, జాతీయత, ఆధార్ నంబరు మార్చుకునేందుకు వీలు కల్పించారు. వివాహ స్థితిని మాత్రమే రెండుసార్లు సవరణ చేసుకోవచ్చు. మిగతా అంశాలన్నీ ఒకసారి మాత్రమే సవరిస్తారు. కాగా చిన్న సవరణల ఆధారాలకు రెండు ధ్రువీకరణ పత్రాలు, పెద్ద సవరణలకు మూడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఈపీఎఫ్‌వో యూనిఫైడ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసినప్పుడు ఆ దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలి. కాగా తాము చేసిన వ్యక్తిగత వివరాల సవరణల్ని అధికారులు సకాలంలో ఆమోదించకుంటే చందాదారులు ఈపీఎఫ్ఐజీఎంఎస్ పోర్టల్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.

# తునికాకు సేకరణ లక్ష్యం ఖరారు



భూపాలపల్లి: వేసవిలో వేలాది మంది గ్రామీణ కూలీలకు ఉపాధినిచ్చే తునికాకు సేకరణకు అవసరమైన ఏర్పాట్లను అటవీ శాఖ చేపట్టింది. గత ఏడేళ్ల క్రితం కొన్ని తునికాకు యూనిట్లకు గుత్తేదారులు ముందుకు రాని కారణంగా జిల్లాలోని కొన్ని మైదాన ప్రాంత యూనిట్లలో ఆకు సేకరణ చేపట్టకపోవడంతో సుమారు రూ.10 లక్షల మేరకు కూలీలు ఆదాయాన్ని కోల్పోయారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలవారీగా తునికాకు యూనిట్ల టెండర్లు ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. ఈ నెల 6న మొదటి విడత, రెండో విడత 21, మూడో విడత మార్చి 10వ తేదీల్లో గుత్తేదారులు టెండర్ నోటీసులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకోవాల్సి ఉంటుంది. తునికాకు టెండర్‌ల షెడ్యూల్ తేదీలను ఖరారు చేస్తూ, రెండు రోజుల క్రితం పీసీసీఎస్ నుంచి సీసీఎఫ్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో పరిశీలిస్తే.. అత్యధికంగా తునికాకు యూనిట్లు జయశంకర్ జిల్లాలోనే ఉన్నాయి. జయశంకర్ జిల్లాలోని భూపాలపల్లి, మహదేవపూర్ అటవీ డివిజన్‌లలో మొత్తం 35 యూనిట్లకు 39,400 స్టాండర్డు బ్యాగులు(ఎస్‌బీ) తునికాకు సేకరణ లక్ష్యంగా అటవీ శాఖ నిర్ణయించింది. అదేవిధంగా ములుగు జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం, ములుగు అటవీ డివిజన్‌లలో మొత్తం 29 యూనిట్లకు 23,800 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా ఈ ఏడాది అటవీ అధికారులు నిర్ణయించారు. ఆకు లభ్యత ఉన్న ఆయా అటవీ ప్రాంతాల్లోని అవకాశాలను బట్టి యూనిట్ల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సేకరించిన ఆకును ఆరబెట్టేందుకు జయశంకర్ జిల్లాలో 231 కల్లాలు, ములుగు జిల్లాలో 328 కల్లాలు ఏర్పాటు చేయనున్నారు. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 559 కల్లాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సారి తునికాకు లభించని ప్రాంతాల్లో కొన్ని యూనిట్లను తగ్గించారు. ఇ- టెండర్ విధానంతోనే తునికాకు యూనిట్ల టెండర్లు చేపట్టనున్నారు. ఈ విధానంతో గుత్తేదారులు సిండికేట్‌గా మారే అవకాశం ఉండదు. ఈ సీజన్‌లో అటవీ అధికారులు ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు మొదటి విడత, ఈ నెల 21వ తేదీ నుంచి 25 వరకు రెండో విడత, మూడో విడత మార్చి నెల 15, 16 తేదీల్లో తునికాకు యూనిట్లకు టెండర్లు నిర్వహిస్తారు. ఈ మేరకు మూడు విడతల్లో జరిగే టెండర్లలో రెండు జిల్లాలోని అన్ని యూనిట్లు అమ్ముడుపోయేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారులు తెలిపారు. అన్ని యూనిట్లు అమ్ముడుపోతేనే గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి పెరిగే అవకాశాలుంటాయి. మరి కొద్ది రోజుల్లోనే టెండర్లు పొందిన గుత్తేదారులు నాణ్యత గల తునికాకు కోసం ప్రూనింగ్(కొమ్మకొట్టుడు) పనులు కూడా చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు. 15 వేల మందికి పైగా ఉపాధితునికాకు సేకరణ ద్వారా ఏప్రిల్ చివరి వారం, మేలో నెలన్నర రోజుల పాటు కూలీలకు మంచి ఉపాధి లభిస్తోంది. అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక్కో యూనిట్ పరిధిలో వెయ్యి మంది వరకు కూలీలకు ఉపాధి దొరకనుంది. వ్యవసాయ పనులు లభించని వేసవిలో ఉదయం పూటనే వారు ఇళ్ల నుంచి బయల్దేరి అడవులకు వెళ్లి ఎండ తీవ్రత పెరగక ముందే తునికాకు సేకరించుకుని తిరిగి ఇంటికి వచ్చేస్తారు. మధ్యాహ్నం నీడపట్టున కూర్చుని 50 ఆకుల చొప్పున సమీప గుత్తేదారులు ఏర్పాటు చేసిన కల్లాలకు తీసుకెళ్లి అమ్ముకుంటారు. ఈ లెక్కన వెయ్యి కట్టలు ఉంటే ఒక ఎస్‌బీపై వచ్చే కూలీకి రూ.1,450 వరకు అందుతుంది. దీని ప్రకారమే 50 ఆకుల కట్టకు ధర రూ.1.40 పైసలు చొప్పున కూలీలకు చెల్లిస్తారు. గతేడాది అమ్ముడు పోని కొన్ని యూనిట్లలో ఆకు సేకరించిన కూలీలు సమీపంలో తునికాకు యూనిట్ల పరిధిలోని కల్లాలకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చు.

# భయం వదిలి... బాగా చదివి



ఖమ్మం : కొవిడ్ ప్రభావంతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు గణనీయంగా తగ్గాయి. రెండేళ్లు ప్రత్యక్ష తరగతులు నిర్వహించకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఆ తర్వాత వైరస్ ప్రభావం నుంచి తేరుకుని పాఠశాలలు ప్రారంభమైన క్రమంలో విద్యార్థులను గాడిలో పెట్టేందుకు ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో గతేడాది కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 'రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత సంవత్సరం మూణ్నెల్లు మాత్రమే ప్రత్యక్ష బోధన కొనసాగగా, ఈ ఏడాది పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

ఏమిటీ కార్యక్రమం

ప్రతి రోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టు పిరియడ్‌లో 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని విద్యార్థుల పఠనానికి కేటాయిస్తారు. విద్యార్థులు పఠించే ఆడియోను సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తారు. వాటిని ఖాళీ సమయాల్లో పరిశీలించి.. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తమ ప్రతిభావంతుల్ని ఎంపిక చేస్తున్నారు. వారిని తర్వాత రోజు తరగతి గదిలో ప్రశంసిస్తున్నారు.

ఏఏ తరగతులకు..

6 నుంచి 9వ తరగతి చదివే వారికి కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఆయా తరగతుల్లో ఖమ్మం జిల్లాలోని 14 కేజీబీవీల్లో 1,120, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 14 కేజీబీవీల్లో 1,301 మంది బాలికలున్నారు. ప్రతిభ ఆధారంగా 'ధారాళంగా.. నెమ్మదిగా.. అరకొరగా' చదివేవారిని మూడు బృందాలుగా విభజిస్తున్నారు. వెనుకబడిన వారు రోజురోజుకు మెరుగయ్యేలా మెలకువలు సూచిస్తున్నారు. వారి ఆడియో రికార్డులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు లోటుపాట్లను సరిదిద్దుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక డైరీ సైతం నిర్వహిస్తున్నారు. కార్యక్రమం సత్ఫలితాలిస్తున్నట్లు విద్యాలయాల ప్రత్యేకాధికారులు పేర్కొంటున్నారు.

చదవడంపై పట్టు సాధించా

వల్లపు గాయత్రి, తొమ్మిదో తరగతి, పాల్వంచ

మా విద్యాలయంలో కార్యక్రమం పకడ్బందీగా అమలవుతుంది. ప్రతి రోజూ తెలుగు, హిందీ, ఆంగ్లం సబ్జెక్టుల్లో నిర్ణయించిన పాఠాన్ని చదివిస్తున్నారు. తరగతి గదిలో అందరి ముందు బెదురు లేకుండా చదవడం అలవాటు చేసుకున్నా. గతంలో కంటే వేగంగా, తప్పులు లేకుండా, తడబడకుండా పాఠ్యాంశాలు చదువుతున్నా.

అవగాహన పెరిగిందిబానోత్ శరణ్య, ఏడో తరగతి, కారేపల్లి

రీడింగ్ ఛాలెంజ్‌కు ప్రతి రోజు అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించిన తర్వాత ఎక్కువ సార్లు చదవడం, వినడంతో ఆయా పాఠ్యాంశాలు మునుపటి కంటే బలంగా గుర్తుండిపోతున్నాయి. ప్రతిరోజు ఉత్తమ పఠన చేసిన వారిని ప్రకటిస్తున్నారు. తద్వారా వెనుకబడిన వారు సైతం బాగా చదివేలా ప్రేరణ పొందుతున్నారు.పకడ్బందీగా అమలు- అన్నామణి, జీసీడీఓ, భద్రాద్రి జిల్లాజిల్లాలో ఈ ఏడాది ఆరంభం నుంచి 'రీడింగ్ ఛాలెంజ్'ను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించడం, వారు మెరుగయ్యేలా చూడటం నిరంతర ప్రక్రియగా జరుగుతోంది. ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసేందుకు కార్యక్రమం ఉపయోగపడుతోంది. నలుగురిలో చదవడం వల్ల బాలికల్లో భయం తొలగి..ఆత్మవిశ్వాసం కలగుతోంది.

# దేశవాళీ మిరపతో ఆదాయం బాగు

ఖమ్మం : దేశవాళీ రకం మిర్చి సాగు చేసిన రఘునాథపాలెం మండలం కోయచలకకు చెందిన రైతు తోట వెంకటేశ్వర్లు అధిక ధర దక్కించుకున్నారు. ఆయన తన ఎకరం భూమిలో చపాటా రసం మిర్చి సాగు చేశారు. దీనికి వరంగల్ ఎనుమాముల మార్కెట్టులో అధిక ధర పలుకుతోందని తెలుసుకుని బస్తాలు తీసుకెళ్లారు. ఈ రకం అత్యధికంగా రూ.56 వేలు జెండా పాట అయ్యిందని, తనకు రూ.48 వేలు ధర దక్కినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం ఆరు క్వింటాళ్లు విక్రయించానన్నారు. తమ గ్రామ సమీపంలోని నర్సరీలో 15 వేల మొక్కలు కొనుగోలు చేసి సాగు చేశానని వెంకటేశ్వర్లు తెలిపారు. సాధారణ రకాలకన్నా దీనికి క్వింటాకు కేవలం రూ.400 కోత ఖర్చు అవుతోందని చెప్పారు. కారం నాణ్యంగా ఉండటంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. తేజ రకాల కన్నా ఇందులో చమురు రెట్టింపు ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు రైతులు, గ్రామస్థులు అభినందించారు.



# పన్ను పోటొద్దు.. ఆదాయం పెంచండిలా..

వరంగల్ : త్రినగరం మహా నగరమైంది. నగర విస్తీర్ణం 406 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఏటా నిర్వహణ వ్యయం కొండలా పెరిగింది. ఒప్పంద ఉద్యోగ, కార్మికుల జీతాలు, కార్యాలయాల నిర్వహణ, కరెంటు బిల్లు, ఇంధనం, తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర వ్యయాలు తడిసి మోపడవుతున్నాయి. ఆదాయం చూస్తే ఎదుగుబొదుగు లేదు. ఈ క్రమంలో గ్రేటర్ వరంగల్ అధికార యంత్రాంగం మనసు పెట్టి పనిచేస్తే సొంత ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. నగర ప్రజలపై పన్నుల భారం వేయాల్సిన అవసరం ఉండదు. బల్దియా 2023-24 ఆర్థిక సంవత్సరం పద్దు(బడ్జెటు) సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో సొంత ఆదాయం పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై కథనం.

ఈసారి బడ్జెట్ అంచనా రూ.610 కోట్లు!

గ్రేటర్ వరంగల్ బల్దియా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.609.47 కోట్ల పద్దు ప్రవేశ పెట్టి రూ.606.80 కోట్లకు సవరించింది. ఈ ఏడాది రూ.610 కోట్లు ఉంటుందని అంచనా.

బల్దియా సొంత ఆదాయం 2022-23లో రూ.200 కోట్లు వస్తాయని అంచనా వేశారు. 2022 డిసెంబరు 31 నాటికి రూ.79.42 కోట్లు మాత్రమే వచ్చాయి. సొంత ఆదాయం పెరుగుతుందని అంకెల్లో చూపుతున్నారు తప్ప ఆదాయం పెంచేందుకు మార్గాలు అన్వేషించడం లేదు.

ఆస్తి పన్నుబల్దియా ప్రధాన ఆదాయం ఆస్తి పన్ను. ఏటా అదనంగా రూ.5-6 కోట్ల వస్తాయని అంచనా వేస్తున్నారు. వాస్తవంగా రూ.2 కోట్లు దాటడం లేదు. నగరంలోని సాధారణ గృహం, వాణిజ్య భవనాలు, పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు అన్ని కలిసి సుమారు 2.53 లక్షల ఆస్తిపన్ను అసెస్‌మెంట్లు ఉంటాయి. గతేడాది ఆస్తి పన్ను ద్వారా రూ.81.80 కోట్లు వస్తాయని అంచనా వేస్తే, 2022 డిసెంబరు 31 నాటికి రూ.54.94 కోట్లు వచ్చాయి. మరో నెలన్నరైతే 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. మహా అయితే మరో రూ.10-15 కోట్లు వస్తాయి.

అదనపు మార్గాలు ఇవే

42 విలీన గ్రామాలు, నగర శివారుల్లో సుమారు 5-6 వేల ఇళ్లకు పన్నులు లేవు. వీటిని గుర్తించి ఆస్తి పన్ను మదింపు చేయాలి. ఇది పారదర్శకంగా ఉండాలి. గృహ నిర్మాణ అనుమతులు పొంది వ్యాపారాలకు వాడుకుంటున్న భవనాలకు పన్ను సవరించాలి. ఇలా చేస్తే ఏటా ఆస్తిపన్నుల ద్వారా రూ.6-8 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

కొన్ని సూచనలు సెల్ టవర్లు, హోర్డింగ్‌లు, ప్రభుత్వ కార్యాలయాల మొండి బకాయిలు వసూలు చేయాలి. వందల సంఖ్యలో అనధికార హోర్డింగ్‌లు వెలిశాయి. వీటికి పన్ను మదింపు చేయాలి. పాత కాంట్రాక్టులు రద్దుచేయాలి. కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాలు, నయీంనగర్ వార్డు కార్యాలయం, పాత మున్సిపల్ భవనం, వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం, చార్‌బౌలి వద్ద దుకాణాలు ఆధునికీకరించాలి. దీనివల్ల అద్దెలు పెరుగుతాయి. కొన్ని ప్రైవేటు కంపెనీలు విచ్చలవిడిగా కేబుల్స్ వేసేందుకు రహదారులు తవ్వుతున్నారు. రోడ్డు కటింగ్ ఛార్జీలు పారదర్శకంగా తీసుకోవాలి. లి కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారింది. నగరంలో పెయిడ్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే ఆదాయం వస్తుంది. లి పెళ్లిళ్లు, శుభకార్యాలయాలు, ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తే ఆదాయం వస్తుంది.

అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లు

2019-కొత్త పురపాలక చట్టం ప్రకారం నగర పరిధిలో కొత్త లేఅవుటు అనుమతులు ఇచ్చే అధికారం గ్రేటర్ వరంగల్‌కు అప్పగించారు. దీనివల్ల కొంత ఆదాయం పెరిగింది. అనధికార లేఅవుట్లపై కొరడా ఝుళిపించాలి.కొత్త మాస్టర్ ప్లాన్ నిబంధనలు, టీఎస్-బీపాస్‌లో భవన అనుమతులు రాకపోవడంతో చాలా మంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. నగర శివారు, విలీన గ్రామాల్లో బిల్డర్లు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనివల్ల గ్రేటర్ ఆదాయానికి గండి పడుతోంది. వీటిని కట్టడి చేయాలి.

కుళాయిలు క్రమబద్ధీకరించాలి

ఏటా తాగునీటి సరఫరా నిర్వహణ వ్యయం రూ.25-26 కోట్లు. నీటి పన్ను ద్వారా ఏటా రూ.11-13 కోట్లు దాటడం లేదు. కేవలం 55-60 శాతం వసూలవుతోంది. నీటి సరఫరా సరిగా లేకపోవడంతో ప్రజలు పన్నులు చెల్లించడం లేదు.నగరంలోని 66 డివిజన్లలో 25 వేల అక్రమ కుళాయిలు గుర్తించాలి. వీటిని ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి. ఇలా చేస్తే అదనంగా ఏటా రూ.5-6 కోట్లు వస్తాయి.

నగరంలో 28 వేల వ్యాపార, వాణిజ్య భవనాలు, 27 వేల ట్రేడ్ లైసెన్సు దారులున్నారు. కమర్షియల్ కుళాయిలు 1500 ఉన్నాయి. గృహ కోటా నుంచి వ్యాపార సంస్థలు తీసుకున్న కనెక్షన్లు 10 వేల పైచిలుకు ఉంటాయి. వీటిని షరతులే లేకుండా క్రమబద్ధీకరించి, నీటి మీటర్లు బిగిస్తే ఏటా రూ.4-5 కోట్ల ఆదాయం వస్తుందని ఇంజినీర్లే అంటున్నారు.

# అర్హత ఉన్నా.. అందని రైతుబంధు

జగిత్యాల : వ్యవసాయ పెట్టుబడి భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వమిస్తున్న 'రైతుబంధు'కు కొత్తగా అర్హత సాధించిన వారికి అందని ద్రాక్షే అయింది. జనవరి మొదటి వారం వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించారు. కానీ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. గతేడాది వానాకాలంలో ధరణి పోర్టల్‌లో నమోదైన జాబితానే ఈ యాసంగిలోనూ పరిగణనలోకి తీసుకున్నారు. అందులో సైతం ఓ తిరకాసుతో పలువురు 'బంధు' అందుకోలేకపోయారు. పూర్తి వివరాలతో కథనం.

పది ఎకరాలు దాటిన వారికి త్వరలో...వానాకాలంలో లబ్ధి పొందిన జాబితాల్లో భూములు విక్రయించిన వారితోపాటు కుటుంబ సభ్యులకు గిఫ్ట్ డీడ్ చేసిన వారి వివరాలు ధరణి పోర్టల్ నుంచి తొలగించారు. కానీ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన కొత్తవారికి అవకాశం ఇవ్వలేదు. ఇలా జిల్లావ్యాప్తంగా సుమారు పది వేల వరకు కర్షకులు సహాయానికి దూరమయ్యారు. వీరేకాకుండా తుది జాబితాలో నమోదై ఇప్పటి వరకు సహాయం పొందని వారు మరో 1425 మంది ఉన్నారు. పది ఎకరాలు దాటిన వారిలో ఇప్పటి వరకు నగదు పడని వారికి ఖాతాలో జమ అయ్యే అవకాశముందని అధికారులు అంటున్నారు.

మిగిలింది నిరాశే...గతేడాది డిసెంబరు వరకు ధరణిలో నమోదైన వారందరికీ ఈ యాసంగి పెట్టుబడి సహాయం అందుతుందని భావించారు. గతంలో అప్పటి వరకు ధరణి పోర్టల్‌లో నమోదైన వారందరినీ పరిగణనలోకి తీసుకునేవారు. కానీ ఈసారికి గత వానాకాలం పంట సాగుకు ఇచ్చిన రైతుబంధు జాబితానే లెక్కల్లోకి తీసుకోవడంతో పలువురు నిరాశతో ఉండిపోయారు.ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే..ధరణి పోర్టల్‌లో కొత్తగా నమోదైన రైతులకు యాసంగి పంట పెట్టుబడికి అందించే రైతుబంధుకు అవకాశం కల్పించలేదు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ఇలా జరిగింది.

## అసైన్డ్ భూముల అన్యాక్రాంతం

హుస్నాబాద్ : భూమిలేని పేదలకు ప్రభుత్వం భూములను పంపిణీ చేసింది. వాటిని సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకోవాల్సిన అసైన్డదారులు ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అసైన్డ్ పట్టాలను చూపి యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. యంత్రాలతో చదును చేసి ఇతరులకు విక్రయిస్తున్నారు. కొంత మందితో ఏర్పడిన ఒక ముఠా ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఫలితంగా అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ అక్రమ దందాతో కొంతమంది అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతోంది.

సాగుకు బదులు అమ్మకం అక్కన్నపేట మండలం రామవరంలో సర్వేనెం.225లో సుమారు 174.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 75.33 ఎకరాల భూమిని ప్రభుత్వం రెండు విడతలుగా అటవీశాఖకు అప్పగించింది. మరో 52.02 ఎకరాలను 2013లో పేదలకు పంపిణీ చేసింది. ఒక్కొక్కరికి 15 గుంటలు, 20 గుంటలు, ఎకరం, రెండెకరాల చొప్పున ఇచ్చి అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. మరో 46.73 ఎకరాల మిగులు భూమి ఉంది. పట్టాల పంపిణీ సమయంలో అప్పటి రెవెన్యూ అధికారు లు ఆ భూములకు హద్దులు చూపించలేదు. అవెక్కడున్నాయో లబ్ధిదారు లకు తెలియదు. ఆసరా చేసుకున్న గ్రామానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడ్డారు. తమకు



కేటాయించిన భూములు సాగు చేసుకోకుండా ఇతరులకు విక్రయిస్తున్నారు. పక్కనే ఉన్న గుడాటిపల్లికి చెందిన వారూ తమ భూమి ఇక్కడే ఉందంటూ రామవరంలోని సర్వేనెం.225లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించడం గమనార్హం. ఎకరానికి సుమారు రూ.5 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. మార్కెట్ ధరకన్నా తక్కువకు వస్తుండటంతో ఇతర గ్రామాల వారు ఈ భూములను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోదా అనే ధోరణితో కొనుగోలు చేస్తున్నారు.

ఠాణాలో ఫిర్యాదు

పట్టాదారులు తమ భూమి వద్దకు వెళ్లే సరికి అక్కడ కొనుగోలు చేసిన వారు ఉండటంతో ప్రశ్నించారు. పలానా వారి నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో.. ఈ భూమి వదిలేసి పక్కనున్న స్థలంలో సాగు చేసుకోవాలని ముఠా వారు ఉచిత సలహా ఇస్తున్నారు. తమ భూమి తమకే కావాలని గట్టిగా అడిగితే తిట్టడం, బెదిరించడం చేస్తున్నారు. ఇవన్నీ భరించలేక బాధితుడు అక్కన్నపేట తహసీల్దార్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూముల ఆక్రమణ, విక్రయంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

ప్రైవేటు వ్యవహారం

క్రయ విక్రయాలన్నీ నోటరీ, స్టాంప్‌పేపర్ల ద్వారా జరుగుతున్నాయి. అసైన్డ్ భూములు కావడంతో రిజిస్ట్రేషన్లు కావు. భూములు మాత్రమే చేతులు మారుతున్నాయి. దస్త్రాల్లోకి ఎక్కవు. అంతటితో ఆగకుండా తన వద్ద ఉన్న కాగితాలతో ప్రభుత్వ మరో భూమిని ఆక్రమిస్తున్నారు. చదును చేసేటపుడు ఎవరైనా వచ్చి అడిగితే దగ్గరున్న పత్రాలు చూపిస్తున్నారు. కొంతమంది ముఠాగా ఏర్పడి గొలుసు ఆక్రమణలు, అమ్మకాలు చేపడుతున్నారు. ఒక పట్టాను చూపి నాలుగైదు సార్లు అమ్మిన ఘటనలూ ఉన్నాయని తెలుస్తోంది. ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు. ముఠా చర్యలతో గుట్టలు కూడా కనుమరుగవుతున్నాయి.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం- సంజీవ్‌కుమార్, అక్కన్నపేట తహసీల్దార్అసైన్డ్ భూములను అమ్మడం, కొనడం నేరం. సాగుకు అనుకూలంగా మార్చుకుని జీవనోపాధి పొందాలే తప్ప విక్రయించొద్దు. అసైన్డ్ భూమిని ఆక్రమించి చదును చేసి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులు కొంతమంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ అక్రమ దందాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

## ప్రతిష్ఠాపనోత్సవాలకు వల్మిడి
## రామాలయం ముస్తాబు

పాలకుర్తి : పాలకుర్తి మండలంలోని వల్మిడి.. రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి జన్మించిన నేలగా విశ్వసిస్తారు. వాల్మీకిపురమే కాలక్రమంలో వల్మిడిగా ప్రాచుర్యం పొందింది. పాలకుర్తి సమీపంలో రామలవారి గుట్ట, మునుల గుట్ట పక్కపక్కనే ఉన్నాయి. ఈ కొండల మధ్య వల్మిడి వెలిసింది. మునులగుట్టపై మునులు తపస్సు చేశారని, రాముల వారి గుట్టపై సీతారాములు నివసించారని భక్తుల నమ్మకం. దక్షిణ అయోధ్యగా పేరుపొందిన ఈ ప్రాంతంలో లవకుశులు కూడా పుట్టారని, వారిని వాల్మీకి ఆదరించారని చెబుతుంటారు. రాముడు నడయాడిన ఈ గడ్డపై మరో మహత్తర ఘట్టం ఆవిష్కృతం కానుంది. రూ.25 కోట్లతో అభివృద్ధి పనులువల్మిడి శివారులోని రాములగుట్ట, పరిసరాలను పర్యాటక వలయం ప్యాకేజీలో భాగంగా సుమారు రూ.25 కోట్లతో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తున్నారు. రాములగుట్టపై భద్రాచలంలో మాదిరిగా కొత్తగా సీతారామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆకట్టుకునే రీతిలో నమూనాలు, విగ్రహాలను తీర్చిదిద్దారు. ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 1 నుంచి 4 వరకు ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నారు. గుట్టపై ఉన్న సుమారు 37 ఎకరాల స్థలంలో మండపం, పార్కింగ్, ఇతర ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయం క్షీరాద్రి అంచున ఉండడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే నియోజకవర్గంలోని పెద్దవంగర, రాయపర్తి, తొర్రూరు, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ప్రచార రథాలతో అవగాహన కల్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ప్రజలను ఆహ్వానిస్తున్నారు.పాలకుర్తికి మూడో సారిముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ పాలకుర్తి మండలానికి మూడో సారి వస్తున్నారు. 2017లో బమ్మెరకు వచ్చి పోతన నడిచిన నేల పరిసరాలను సందర్శించారు. చారిత్రక సమాధి, బావిని పరిశీలించారు. అక్కడే పర్యాటకాభివృద్ధి నిధులను ప్రకటించారు. 2018లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి వచ్చి బహిరంగసభలో పాల్గొన్నారు. ప్రస్తుతం మూడోసారి సెప్టెంబరు 4న కేసీఆర్ పాలకుర్తి మండలం వల్మిడికి రానునుండడంతో నియోజకవర్గ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇప్పటికే రాముల గుట్టపై రామాలయ అభివృద్ధి పనులు పూర్తికాగా, సీఎం మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు ప్రకటించే అవకాశం ఉంది.నిత్యం పర్యవేక్షణ ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ రానుండడ ంతో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిత్యం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ప్రోత్సహిస్తేనే పురోగతి



సంగారెడ్డి : ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరికీ కొలువులు దక్కడం కాస్త కష్టమే. ప్రభుత్వ ఉద్యోగాలు మరీ కష్టం. నిరుద్యోగం తగ్గాలంటే ప్రధానంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల్సిందే. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోంది. ముందుకొచ్చే వారికి అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది. ప్రధానంగా చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేలా రాయితీ రుణ పథకాన్ని అమలు చేస్తోంది. నేడు చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా కథనం.ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ప్రధాన వృత్తి వ్యవసాయమే. ఇటీవల పారిశ్రామికీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో పరిశ్రమలు వెలిశాయి. పటాన్‌చెరు, మనోహరాబాద్, హత్నూర, జిన్నారం, ములుగు, నర్సాపూర్, తాండూరు తదితర ప్రాంతాల్లో వివిధ రకాల పరిశ్రమలు స్థాపించారు. అత్యధికం భారీ పరిశ్రమలే కావడంతో ఆయా చోట్ల లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. మరోవైపు ఇప్పుడిప్పుడే చిన్నతరహా పరిశ్రమలు సైతం వెలుస్తున్నాయి. ఆహార శుద్ధి రంగంలో అత్యధికంగా ఏర్పాటుచేస్తున్నారు.

రుణాలు ఇలా..ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత ఇబ్బందులు పడుతోంది. పారిశ్రామిక యూనిట్ల స్థాపన దిశగా వీరిని అడుగులు వేయిస్తే ఉపాధి పొందడంతో పాటు మరో పది మందికి అండగా నిలుస్తారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ)లో భాగంగా రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్( కేవీఐసీ), జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ), ఖాదీ పరిశ్రమల బోర్డు(కేవీఐబీ) ఏజెన్సీలు పీఎంఈజీపీ కింద రాయితీలు అందిస్తున్నాయి.

బ్యాంకర్లు ముందుకొస్తేనే..

ప్రభుత్వం రాయితీ నిధులను ఆలస్యంగా విడుదల చేస్తున్నా బ్యాంకర్ల తీరుతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు కావడంతో వారికి ఇచ్చే రుణాన్ని తిరిగి చెల్లిస్తారో లేదోనని అనుమానిస్తున్నారు. ప్రభుత్వం రాయితీ మంజూరు చేసినా బ్యాంకు రుణం అందకపోవడంతో యూనిట్లు గ్రౌండింగ్‌కు నోచని పరిస్థితి. బ్యాంకు అధికారులు తీరు మార్చుకుంటే మార్గం సుగమం అవుతుంది.

ఇలా చేస్తే మేలు..

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వమే భూమి కేటాయించాలి. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో కొనుగోలు చేయడం కష్టంగా మారింది.వ్యవసాయానికి ఇస్తున్న మాదిరిగా ఏడాది వరకైనా ఉచిత విద్యుత్తు నిరంతరం ఇస్తే మేలు.నీటి కనెక్షన్‌తో పాటు ఇతర వసతులు కల్పించాలి.

రాయితీ నిధుల విడుదల జాప్యం లేకుండా చూడాలి.

బ్యాంకర్లు రుణాలు ఇచ్చేలా చొరవ చూపాలి.

సంగారెడ్డి ద్వితీయం

పారిశ్రామికంగా సంగారెడ్డి జిల్లా ఇప్పటికే అభివృద్ధి పథంలో సాగుతోంది. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల్లో జిల్లా ఈ ఏడాది రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. కానీ చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం మాత్రం అంతంతే ఉంది. ప్రభుత్వపరంగా సాయం అందిస్తే యువత ముందుకొచ్చే అవకాశం ఉంది. డీఐసీ ద్వారా 30 యూనిట్లకు రూ.84.61లక్షలు రాయితీ ఇవ్వనున్నారు. కేవీఐబీ ద్వారా 15 యూనిట్లు నెలకొల్పాలని లక్ష్యంగా నిర్ణయించారు. రూ.42.39 లక్షలు రాయితీ ఇస్తారు. ఇక కేవీఐసీతో 13 యూనిట్లకు రూ.84.61 లక్షలు రాయితీ రూపంలో లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ఊపందుకుంటోంది..

మెదక్ జిల్లాలో ఇప్పుడిప్పుడే పారిశ్రామిక రంగం ఊపందుకుంటోంది. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో పారిశ్రామిక వాడను నెలకొల్పారు. చిన్నశంకరంపేట, చేగుంట, తూప్రాన్‌లలో పరిశ్రమలు వెలిశాయి. జిల్లాకు చెందిన పలువురు చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారు. టీఎస్‌ఐపాస్ విధానంలో 452 పరిశ్రమలకు అనుమతి ఇవ్వనున్నారు. ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు 25 యూనిట్లకు రూ.74.97 లక్షల మేర రాయితీ ఇవ్వనున్నారు. ఎస్టీ వర్గానికి చెందిన పారిశ్రామిక వేత్తలకు 51 యూనిట్లు నెలకొల్పాలని లక్ష్యంగా నిర్దేశించారు. వారికి రూ.1.53 కోట్లు రాయితీ రూపంలో ఇవ్వనున్నారు.

18,566 మందికి ఉపాధి..

సిద్దిపేట జిల్లాలో 631 చిరు, చిన్న తరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. రూ.278.8 కోట్ల పెట్టుబడితో స్థాపించగా 18,566 మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సేవా రంగానికి సంబంధించి 7-ఎస్సీ, 11-ఎస్టీ యూనిట్లకు రూ.47.7 లక్షలు రాయితీని ప్రభుత్వం మంజూరు చేసింది. పీఎంఈజీపీ 30 యూనిట్లు లక్ష్యంగా ఉన్నప్పటికీ ఇప్పటికే రెట్టింపు స్థాయిలో అమలుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాకు ఈసారి 129 యూనిట్లు మంజూరయ్యాయి. కొత్తగా ఐదు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశారు. ములుగు మండలం బండతిమ్మాపూర్ వద్ద కోకకోలా పరిశ్రమ నాలుగు నెలల్లో మొదటి దశ నిర్మాణం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణం మొదలైంది. ఈసారి డీఐసీ ద్వారా 59 యూనిట్లకు రూ.2.048 కోట్లు రాయితీ ఇవ్వనున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి..

సూర్యాపేట మహేశ్ స్వగ్రామం కొండాపూర్ మండలం మారేపల్లి. పది వరకు సొంత గ్రామంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. సంగారెడ్డిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్, నర్సాపూర్ బీవీఆర్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. కొన్నాళ్ల పాటు ప్రైవేటు పరిశ్రమల్లో పని చేసిన మహేశ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో సొంతంగా చిన్నతరహా ఔషధ పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు పొందకుండానే సొంతంగా ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం 25 మందికి ఉపాధి చూపుతుండటం విశేషం. క్యాన్సర్, బీపీ, వైరల్ జ్వరానికి సంబంధించి చికిత్సలకు వినియోగించే ఔషధాలను ఉత్పత్తి చేస్తున్నారు. స్థలం ఇస్తే జిల్లాలోనే చిన్నతరహా పరిశ్రమను ఏర్పాటుచేస్తానని చెబుతున్నారు మహేశ్.

# నిరీక్షించి.. నీరసించి..



జహీరాబాద్ : సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బస్సులు సమయానికి రాకపోవడం,కొన్ని చోట్ల సదుపాయం లేకపోవడంతో నడక తప్పడంలేదు. నర్సాపూర్–హైదరాబాద్, జహీరాబాద్ నుంచి చిరాగ్‌పల్లి జాతీయ రహదారిపై ఆర్డినరీ బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మరి కొన్ని మార్గాల్లో ఉదయం సమయంలో తక్కువగా ఉండడంతో ఉన్న వాటిలోనే కిక్కిరిసి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పరిశీలన కథనం...జిల్లాలో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే మార్గాల్లో బస్సులు సరిగా లేవు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పిల్లల సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టి తీసుకుపోవడంలేదు. ఉన్నవాటిల్లోనే ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రయాణికులు నిండుగా ఉన్నప్పుడు కొన్ని చోట్ల ఆపడం లేదని వాపోతున్నారు. సంగారెడ్డి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు వెళ్లే వారి ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సౌకర్యం లేకజహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. చిరాగ్‌పల్లి జాతీయ రహదారి మధ్యలోని పల్లెలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆర్డీనరీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జహీరాబాద్ నుంచి మొగుడంపల్లి వరకు 15 స్టేజీలున్నాయి. జహీరాబాద్ నుంచి కోహీర్ వరకు కూడా సరిగా లేవు. మైకోడ్ నుంచి మండల కేంద్రమైన మనూరుకు బస్సులు లేక నిత్యం మూడు కిలోమీటర్లు నడుస్తున్నారు. నారాయణఖేడ్ నుంచి బయలు దేరే బస్సులు మనూరు, నాగల్‌గిద్ద మండలంలోని పలు గ్రామాల మీదుగా కిక్కిరిసి వస్తున్నాయి. బీబీపేట, మార్డి, ఫత్తేపూర్, మసాన్‌పల్లి, మహాదేవ్‌పల్లి, దేవునిపల్లి గ్రామాలకు చెందిన 200 మంది విద్యార్థులు కల్హేర్‌లో చదువుకుంటున్నారు. ఈ గ్రామాలకు బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తప్పని నడక గుమ్మడిదల మండలం కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల నుంచి బస్సులు లేక నాలుగు కిలోమీటర్లు నడిచి జాతీయ రహదారికి చేరుకుంటున్నారు.

నర్సాపూర్‌కు వెళ్లేందుకు స్టాపుల వద్ద బస్సులు సరిగా ఆపడం లేదు. కొన్ని ఆపినా ఫుట్‌పాత్ మీద నిలబడాల్సి వస్తోంది. మెదక్– హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, తదితర గ్రామాల నుంచి కళాశాలలకు వెళ్లేందుకు బస్సులు సరిగా లేవు. ఐడీఏ బొల్లారం నుంచి చందానగర్, మియాపూర్‌కు నిత్యం 500 మంది విద్యార్థులు వెటళతారు. ఉదయం సమయంలో మూడు బస్సులు మాత్రమే ఉన్నాయి. సరిపోను నడపాలని విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నారు. అవసరమైన చోట నడిపిస్తాంసుదర్శన్, ఆర్టీసీ ఆర్ఎం విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా అవసరం మేరకు బస్సులు నడిపిస్తాం. డిపోల వారీగా ఎక్కడ సమస్యలున్నాయో విద్యాధికారులు సమచారం ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అడిగిన చోట్ల బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బాలసముద్రం : తెలంగాణలో నిబంధనలను అతిక్రమిస్తూ బహుళ అంతస్తులు నిర్మిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. ఈ మేరకు రేరా ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందించారు. రియల్టర్లు వ్యాపార ప్రకటనలతో నిర్మాణాలు పూర్తి కానప్పటికీ తప్పుడు సమాచారం అందిస్తూ బుకింగ్‌ల పేరిట పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

నిర్మాణాలలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. రేరా ఆధ్వర్యంలో భవన నిర్మాణ చట్టాలపై ప్రజల్లో చైతన్యపరిచే సదస్సులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, ఏఐసీడబ్ల్యూసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.భీంరెడ్డి, దక్షణాది రాష్ట్రాల కోకన్వీనర్ డాక్టర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమం.. ప్రమాదకరం..

ములుగు : వెంకటాపురం మండలం చిరుతపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సమస్యలు వేదిస్తున్నాయి. మూడు నుంచి పది తరగతులకు చెందిన 125 మంది విద్యార్థులు అభ్యసిస్తూ వసతి పొందుతున్న ఆశ్రమంలో సౌకర్యాల లేమి, ఉపాధ్యాయుల కొరత భావిపౌరులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దశాబ్దాల నాటి శిథిల భవనంలో భయం గుప్పిట్లో సహవాసం చేయాల్సిన దయనీయ స్థితి నెలకొంది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే సదుపాయాలను కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గిరిజన బిడ్డలకు కష్టాలు తప్పడం లేదు.

వెక్కిరిస్తున్న ఇంజినీర్ల ప్రణాళిక!

ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారుల ప్రణాళిక వెక్కిరిస్తోంది. రూ.కోట్లలో నిధుల కేటాయిస్తున్నా అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, ఉద్యోగులకు శాపంగా మారాయి. 20018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆశ్రమానికి రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో భవనాన్ని మంజూరు చేశారు. నిర్మాణంలో కాలాతీతం, అధికారుల నిర్లక్ష్యం, సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ఆ భవనం పై అంతస్తు అసంపూర్తిగా ఉంది. ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే గతేడాది రూ.10 లక్షల నిధులను మరమ్మతుల పేరుతో మంజూరు చేశారు. ఆ నిధులు ఎందుకూ సరిపోకపోవడంతో అసంపూర్తి భవనం పనులకు బదలాయించారు. అరకొరగానే నిర్మాణాలు సాగుతున్నాయి. పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు, పనులు చేస్తేనే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండనుంది.

అవస్థలు వర్ణనాతీతం

గిరిజన బిడ్డల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. 1986లో నిర్మించిన వసతి భవనం శిథిలావస్థకు చేరింది. గదులన్నీ పెచ్చులూడి



ప్రమాదకరంగా మారాయి. ఈ భవనానికి చెందిన విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా ఉండటం, వర్షానికి పైకప్పు, గోడలు తడుస్తుండటంతో కరెంటు సరఫరా అవుతోంది. ఇటీవల షార్టుసర్క్యూట్ సమస్యలు తలెత్తి మంటలు వ్యాపించగా, శుద్ధిజలం ప్లాంటు గదిలోకి వెళ్లిన సిబ్బందికి ప్రమాదం తప్పింది.్రశాలలు, మరుగుదొడ్లకు చెందిన పైపులు ధ్వంసమై నీటి సరఫరా ఎక్కడికక్కడ నిలుస్తోంది. నీటి సమస్య ఏర్పడింది. నల్లాలకు సైతం ట్యాపులు లేకపోవడంతో విద్యార్థులు కష్టాలు పడాల్సి వస్తోంది.

భయంతో గడుపుతున్నాం

అసౌకర్యాలతో తిప్పలు పడుతున్నాం. భవనానికి విద్యుత్తు సరఫరా అవుతుండటంతో భయం భయంగా గడుపుతున్నాం. వర్షం పడితే లీకులతో గదులు తడుస్తున్నాయి. సామగ్రి భద్రపరుచుకోవడం కష్టంగానే ఉంది. ఏళ్లుగా ఇవే అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదు.

వసతి,చదువు ఒకేచోట కల్పించాలి

చదువులు ఓ చోట, వసతి మరో చోట ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. రోజుకు నాలుగు దఫాల పావు కి.మీ దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. గ్రామం నుంచి వెళుతుండటంతో రక్షణ లేని పరిస్థితి ఉంది. ఆశ్రమ పాఠశాల కొనసాగిస్తున్న ప్రాంగణంలోనే వసతి కల్పిస్తేనే ఇబ్బందులు తొలగనున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

సపక నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు

ఆశ్రమ పాఠశాల, వసతి భవనంలో అవస్థలను ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్య తీవ్రంగానే ఉండటంతో తాము కష్టాలు పడాల్సి వస్తోంది. వసతి భవనం నుంచి పాఠశాల భవనం వద్దకు రోజూ విద్యార్థులను తీసుకెళ్లడం, మళ్లీ చేర్చడం సమస్యగా ఉంది. శిథిలావస్థకు చేరిన భవనంలో ఉండటం అపాయంగా ఉన్నట్లు అధికారులకు విన్నవించాం. ప్రస్తుతం పాఠశాల నిర్వహిస్తున్న ప్రాంగణంలోనే వంటశాల, పై అంతస్తులో విద్యార్థులకు వసతి కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉండనుంది.

## భగీరథ నీరెలా..?


కొత్తగూడ : గణప సముద్రం చెరువు గతేడాది ఈ నెలలో నిండి మత్తడి పోసింది. ఈ సారి వర్షాభావ పరిస్థితి తలెత్తింది.. రైతులంతా దుక్కులు దున్ని నాట్లు వేసే సమయంలో గణప సముద్రం అడుగంటిపోయి కనిపిస్తోంది. ఇక నియోజకవర్గానికి మిషన్ భగీరథ తాగునీరు అందించే గణప సముద్రంలో ఇన్‌టెక్‌వెల్ వద్ద నీరు అరకొరగానే ఉంది. ఇందులో నడిచే రెండు మోటార్లకు సరిపడా నీరందడం లేదని ఆపరేటర్లు చెబుతున్నారు. గతేడాది చెరువులోని నీరంతా ఆయకట్ట పంట పొలాలకు వదిలారు. సుమారు నాలుగు వేల ఎకరాల్లో రెండు పంటలు పండాయి. ఇప్పుడు నీటికి కటకట ఏర్పడడంతో దేవాదుల నీటితో గణపసముద్రం నింపే ప్రయత్నం చేస్తున్నారు. దేవాదుల నుంచి రామప్ప సరస్సులోకి జలాలు వదిలితే ఆ నీరు గణపురం మండలం బుద్దారం వంగపల్లివాణి చెరువులోకి వస్తుంది. ఆ చెరువు నిండాక మత్తడి పడితే నీరు గణప సముద్రంలోకి వెళ్తుంది. పది రోజుల క్రితం అధికారులు నీటిని వదలగా వంగపల్లి చెరువు మత్తడి పడి నీరు గణప సముద్రంలోకి చేరింది. అయితే రైతులు గ్రావిటీ కెనాల్‌లో విద్యుత్తు మోటార్లను అమర్చుకొని నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. గణప సముద్రంలోకి వెళ్లే నీటిని కొందరు రైతులు దారి మళ్లిస్తూ అక్రమంగా పంటలను సాగు చేసుకుంటున్నారు. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. రామప్ప సరస్సు నుంచి వస్తున్న నీరు అనుకున్న స్థాయిలో గణప సముద్రంలోకి చేరకపోవడంతో చెరువు రోజురోజుకు అడుగంటుతోంది. ఈ కాల్వలో విపరీతమైన తుంగ పెరిగి ప్రవహించే నీటికి అడ్డుపడుతున్నాయి. నీటి పారుదల అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు చెబుతున్నారు.వర్షాలు లేకపోతే ఎలా..?ప్రస్తుత వర్షాకాలం ఆశించిన స్థాయిలో లేదు. ఇప్పటిదాకా ఒక భారీ వర్షం కూడా లేదు. దీంతో చెరువులోకి కొత్తనీరు రావడం లేదు. ఒక వేళ వర్షాలు సరిగా పడకపోతే మిషన్ భగీరథ ఆగిపోయే పరిస్థితి వస్తుందని అధికారులు చెబుతున్నారు. తక్షణమే.. గ్రావిటీ కెనాల్‌లో తుంగను తీసేసి మోటార్లను తొలగించాలని ఓ భగీరథ అధికారి తెలిపారు. రామప్ప సరస్సు నుంచి ఇంకా కొంచెం ఎక్కువ మోతాదులో నీటిని వదలాలని పేర్కొన్నారు. లేకుంటే నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఆ అధికారి పేర్కొన్నారు.కాల్వను పరిశీలిస్తాంగ్రావిటీ కెనాల్‌ను పరిశీలించి తుంగను తొలగిస్తాం. అక్రమ మోటార్లను తొలగిస్తాం.. నీటి చౌర్యం జరగకుండా చూస్తాం.

# రైతుల చూపు పండ్లతోటల వైపు!

కొత్తగూడెం : వాతావరణంలో వస్తున్న మార్పులు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉభయ జిల్లాల్లోని పలువురు రైతులు పండ్ల తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. కూరగాయల కొరతకు తోడు పండ్ల తోటల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీరాజ్, ఉద్యాన, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై పండ్ల తోటల పెంపకానికి అవకాశం కల్పిస్తోంది. అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి సీతాఫలం, యాపిల్, మామిడి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ (అర ఎకరం మాత్రమే), జీడిమామిడి, కొబ్బరితో పాటు మునగ, ఆయిల్‌పామ్ వంటి అధిక దిగుబడినిచ్చే తోటల పెంపకం చేపట్టాలని నిర్ణయించింది. ఉద్యానశాఖ రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది.

గరిష్ఠంగా అయిదెకరాలు

ఉపాధి కూలీలుగా నమోదైన చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. ఎస్సీ, ఎస్టీలకు 100



శాతం, మిగతా సామాజిక వర్గాల రైతులకు 90 శాతం రాయితీ వర్తించనుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా ఐదెకరాల్లో పండ్ల తోటలు సాగు చేయవచ్చు. మొక్క నాటిన నుంచి నాలుగేళ్ల వరకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు అందుతాయి. గుంతలు తవ్వటం, మొక్కలు కొనటం, ఎరువులు, ప్రతినెలా పర్యవేక్షణ వంటి వాటికి రాయితీలు వర్తిస్తాయి. భూములు, మొక్కల ఎంపిక మొదలుకొని పండ్ల ఉత్పత్తి దశ వరకు అన్ని అంశాల్లో ఉద్యానశాఖ మార్గదర్శకాలను కర్షకులు పాటించాల్సి ఉంటుంది.

భద్రాద్రిలో లక్ష్యానికి మించి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,300 ఎకరాల్లో పండ్ల తోటలు పండించాలని లక్ష్యం నిర్ణయించగా ఇప్పటికే 3,395 ఎకరాల్లో సాగు చేయటానికి 1,915 మంది రైతులు దరఖాస్తులు సమర్పించటం విశేషం. ఖమ్మం జిల్లాలో 653 ఎకరాల్లో సాగుకు 448 మంది రైతులు ముందుకొచ్చారు. దరఖాస్తుల సమర్పణకు గడువు జులై 31కి ముగిసినా ఆసక్తి గల రైతులు ఈ నెలాఖరు వరకు అర్జీలు పెట్టుకోవచ్చునని సంబంధిత అధికారులు తెలిపారు.

జిల్లాల వారీగా పండ్ల తోటల సాగు వివరాలు

దరఖాస్తు చేసుకున్న రైతులు: 1,915 448

సాగు విస్తీర్ణం (ఎకరాల్లో): 3,395 653

మార్కెట్‌లో ఫలాలకు డిమాండ్ పెరుగుతుండటంతో రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు వస్తున్నారు. పండ్ల తోటలు సాగుతో అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది. మొక్కలు నాటినప్పటి నుంచి నాలుగేళ్ల పాటు వాటి మధ్యలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. నాలుగేళ్ల పాటు అంతర పంటలు, ఆ తర్వాత పండ్ల తోట ద్వారా ఆదాయం పొందుతారు. పండ్ల తోటల సాగుకయ్యే పెట్టుబడి ఖర్చులను ప్రభుత్వం రాయితీల రూపంలో అందిస్తుంది. రైతులకు పెట్టుబడి పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# ఈఎస్ఐ దవాఖానాకు మరో వైద్యుడి రాక

కొత్తగూడెం : బూర్గంపాడు మండలం సారపాకలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో వైద్యసేవలు మెరుగు పడనున్నాయి. ఇప్పటికే ఉన్న వైద్యుడికి తోడు మరో పోస్టును మంజూరు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి చెందిన వైద్యుడిని సారపాకకు కేటాయించారు. దీంతో ఈ ఆసుపత్రిలోని వైద్యుల సంఖ్య రెండుకు చేరనుంది.

25 వేల మంది కార్మికులు

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో సుమారు 25 వేల మంది కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారు. ఒక్కో కుటుంబానికి నలుగురు చొప్పున లెక్కలేసినా సుమారు లక్ష మందికి ఈఎస్ఐ ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. ఈఎస్ఐ పరిధిలోని కార్మికులు వైద్యసేవల కోసం సారపాక డిస్పెన్సరీకి రావాల్సిందే. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ వైద్య కేంద్రంలో ఒక్కరే వైద్యుడు సేవలు అందిస్తున్నారు. వైద్యుల సంఖ్య పెంచి డిస్పెన్సరీ నుంచి ఆసుపత్రిగా ఉన్నతీకరించాలని కార్మిక సంఘాల నాయకులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో వైద్యులను సర్దుబాటు చేస్తూ కార్మిక శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి చెందిన వైద్యుడిని సారపాకకు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ పరిశ్రమలతో పాటు చిన్నతరహా పరిశ్రమలు అనేకం ఉన్నాయి. వీటితోపాటు మాల్స్, హెూటళ్లు, వ్యాపార సముదాయాల్లో అధిక సంఖ్యలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. యాజమాన్యాలు వీరికి విధిగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పిస్తున్నాయి. దీంతో కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది.

ఎవరు అర్హులు

నెలకు రూ.21 వేలు అంతకన్నా తక్కువ వేతనం పొందే కార్మికులు ఈఎస్ఐ సౌకర్యం పొందడానికి అర్హులు. ఈఎస్ఐ కార్డు పొందిన వారితోపాటు వారి భార్య లేక భర్త వారి సంతానం, తల్లిదండ్రులు ఈఎస్ఐ సేవలు పొందే వీలుంది. ప్రస్తుతం బూర్గంపాడు మండలం సారపాకలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉంది. గతంతో కొత్తగూడెంలోని రామవరంలో దీన్ని నిర్వహించేవారు. అనంతరం సారపాకకు మార్చారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో అధిక సంఖ్యలో కార్మికులు ఈఎస్ఐ ఆసుపత్రికి వస్తున్నారు. రోజుకు సుమారు 200 వరకు ఓపీ ఉంటుంది. శస్త్రచికిత్సలకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు రిఫర్ చేస్తున్నారు. ప్రతీ జిల్లాకు బ్రాంచి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులు గతంలోనే నిర్ణయించారు. నూతన వైద్యుడితో పాటు బ్రాంచి కార్యాలయం ఏర్పాటైతే కార్మికులకు సేవలు మరింత చేరువ కానున్నాయి.

# సరిహద్దులో గొలుసుకట్టు దందా..



కొత్తగూడెం : తెలుగు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామాల మద్యం ప్రియులు దూరంలో ఉన్న వైన్‌షాపులకు వెళ్లలేక ఇక్కడకు వస్తున్నారు. దీంతో ఎమ్మార్పీకి మించి ఇష్టారీతిన విక్రయాలు సాగిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఈ దందాను మద్యం దుకాణాలే ప్రోత్సహిస్తుండగా నియంత్రించాల్సిన ఆబ్కారీ శాఖ 'మామూలు'గానే పరిగణిస్తోంది. వెరసి సరిహద్దుల్లో విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.

ఆయా ప్రాంతాలే అడ్డాలు

ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలైన మధిర మండలం తొండలగోపవరం, తొర్లపాడు, సాయిపురం, రామచంద్రాపురం, రొంపిమళ్ల, జాలిముడి, మల్లారం, సిద్ధినేనిగూడెం, నాగవరప్పాడు, చిలుకూరు, అల్లీనగరం, దేశినేనిపాలెం, ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం, రాజుపాలెం, రామన్నపాలెం, భీమవరం, కాచరం, గట్లగౌరవరం, బోనకల్లు మండలం చొప్పకట్లపాలెం, గోవిందాపురం, బోనకల్లు ప్రాంతాల్లో, చింతకాని, ముదిగొండ మండలాల్లోని ఆంధ్రా సమీప గ్రామాలైన వల్లభి, బాణాపురం, చిరుమర్రి, కమలాపురం, గంధసిరి, మాధాపురం, పరిసర గ్రామాల్లో కొందరు చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వాటినే గొలుసుకట్టు దుకాణాలకు అడ్డాగా మార్చుకున్నారు.

బయటి మద్యం విక్రయిస్తే దాడులు

గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారు ఆ ప్రాంతంలోని మద్యం దుకాణదారుల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేసి విక్రయించాలి. దీనికి భిన్నంగా బయట నుంచి మద్యం తీసుకువస్తే వారిపై మద్యం దుకాణ యజమానులే దాడులు చేయిస్తున్నారు. ఇందుకోసం మద్యం దుకాణదారులు ఆబ్కారీ అధికారులకు నెల నెలా ముడుపులు అందిస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో వైన్ షాపు కనుసన్నల్లోనే గొలుసుకట్టు దుకాణాల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గొలుసుకట్టు నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

ఈ విషయమై మధిర ఆబ్కారీ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా మధిర ప్రాంతంలో నిర్వహిస్తున్న గొలుసుకట్టు దుకాణాలపై దాడులు చేసి నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మీకింత.. మాకింత

గొలుసుకట్టు దుకాణాలు నిర్వహించే వారి కోసం మద్యం దుకాణాల్లోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వారు కొనుగోలు చేసే మద్యంపై ఎమ్మార్పీ కంటే రూ.20 ఎక్కువగా తీసుకుంటున్నారు. వైన్ షాపుల్లో అదనంగా చెల్లించిన బెల్టు షాపుల వారు.. తామేం తక్కువ కాదన్నట్లు ఎమ్మార్పీకి అదనంగా రూ.40 తీసుకుని దర్జాగా విక్రయిస్తున్నారు.

పట్టించుకోని ఆబ్కారీ అధికారులు

గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. వారు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వాదనలు విన్పిస్తున్నాయి. అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నా అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు కనీసం చూడకపోవటం విడ్డూరంగా ఉంది.

# తొందరపడతారు.. తోవ చూపాలి



కొత్తగూడెం : చదువుకొనే విద్యార్థులు.. పోటీ పరీక్షలో విజయమే లక్ష్యంగా సిద్ధమయ్యే అభ్యర్థులు.. వీరిద్దరూ ఒత్తిడిని అధిగమించలేకపోతున్నారు. కొందరు విద్యాలయాల్లోంచి తప్పించుకుంటున్న పరిస్థితి ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏదో ఒక చోటుచేసుకుంటోంది. బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కూడా ఉంటున్నారు. రాజస్థాన్ రాష్ట్రం కోటాలోని కొన్ని కోచింగ్ సెంటర్లలో వరుస ఆత్మహత్యల పరంపర దేశంలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలోనూ పలువురు విద్యార్థులు రెసిడెన్షియల్ చదువులు కొనసాగించలేక పారిపోతున్నారు. తల్లిదండ్రులు, బోధనా సిబ్బంది మందలింపుతో మనస్తాపం చెంది మరికొందరు బలవన్మరణాలకూ వెనుకాడటం లేదు. తమ పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు కావాలని కన్నవారు కలలు కంటుంటే.. ఆ క్రమంలో ఒత్తిడి తాళలేక కడుపు కోత మిగులుస్తున్న వారెందరో ఉన్నారు. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో బలవంతపు చదువులు తగవని, ఆసక్తి ఉన్నరంగాల్లో రాణించేలా పిల్లలను ప్రోత్సహించడం మేలని విద్య, వైద్య రంగాల నిపుణులు సూచిస్తున్నారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో అభ్యసన సామర్థ్యాలు, జీవన నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొంటున్నారు. విపరీత పోటీ కారణంగా కలల కొలువు దక్కలేదన్న నైరాశ్యంలో మునిగిపోవద్దని, నైపుణ్యం ఉన్న మరో రంగంలో స్థిరపడేలా నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని ఓ పట్టణంలోనున్న ఇంజినీరింగ్ కళాశాలలో గతేడాది ఒక విద్యార్థిని తల్లిదండ్రులు చేర్పించారు. ఇష్టం లేని కోర్సులో చేరిన అతడు. వార్షిక ఫలితాల్లో వెనుకబడ్డాడు. చదువు కొనసాగించలేక కుంగిపోయాడు. కొద్ది వారాల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సివిల్స్ ప్రిలిమినరీలో అర్హత సాధించలేదన్న మనస్తాపంతో ముప్పై ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఇటీవల ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది.

అధ్యాపకుడు మందలించాడన్న మనస్తాపంతో ఇటీవల భద్రాద్రి జిల్లాకు ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ విద్యార్థినికి ఇంజినీర్ కావాలనేది కల. కానీ ఆమెను 'ఐఏఎస్' చేయాలనే కోరికతో తల్లిదండ్రులు కొత్తగూడెం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో చేర్పించారు. తోటి స్నేహితులంతా ఇష్టమైన చదువులు చదివి జీవితంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఒత్తిడి తాళలేని సదరు యువతి ఇంట్లో ఉరేసుకొని మృత్యువాత పడింది.

ఇష్టమైన విద్య అభ్యసించేలా చూడటం మేలు

చాలా మంది తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ పూర్తవగానే ఐఐటీ, ఎన్ఐటీ, ప్రముఖ వర్సిటీలు, ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో సీటు సాధించాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఇష్టం లేకున్నా రూ.లక్షలు పోగేసి శిక్షణలూ ఇప్పిస్తున్నారు. కొందరు పిల్లలు సైతం కన్నవాళ్ల ఆకాంక్షలను నెరవేర్చాలని శిక్షణ కేంద్రాల్లో, కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు. చివరకు అనుకున్నది సాధించలేమోనన్న భయం, ఒత్తిడితో కొందరి జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. విద్యార్థి అభ్యసన సామర్థ్యం, విజ్ఞాన సముపార్జన, ఆసక్తులను బట్టి ప్రోత్సహిస్తే తమ భవిష్యత్తును తామే చక్కగా నిర్మించుకోగలరన్న విషయాన్ని మరవొద్దు. ప్రస్తుత ఆధునిక, సాంకేతిక ప్రపంచంలో అవకాశాలకు కొదవే లేదు. పున్నం చందర్, ప్రిన్సిపల్, కొత్తగూడెం మైనింగ్ కళాశాల

సరైన జీవన శైలితో ఒత్తిడి దూరం

ప్రతి ఒక్కరికీ నిద్ర ఎంతో అవసరం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిద్ర వేళలు తగ్గిపోయాయి. కనీసం రోజుకు 7 నుంచి 8 గంటల నిద్ర అవసరం. అప్పుడే ఒత్తిడి తగ్గి.. ప్రశాంతంగా ఆలోచించగలుగుతారు. తీసుకునే ఆహారమూ ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. కూరగాయలు, పండ్లు, చేపలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లో కార్బొహైడ్రేట్స్, ప్రొటీన్స్, విటమిన్స్‌తో పాటు మినరల్స్ తగినన్ని ఉంటాయి. ఈ ఆహారం తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ప్రకృతితో కాసేపు గడపడం అలవాటు చేసుకోవాలి. చదువు, పోటీ పరీక్షల విషయానికొస్తే.. ఏదైనా లక్ష్యం ఎంపిక చేసుకునే ముందు దాన్ని ఎలా పూర్తిచేయాలో ఒక అవగాహన, ప్రణాళిక ఉంటే ఒత్తిడి తగ్గుతుంది. చేసే పని ఏదైనా ఇబ్బందికరంగా కాకుండా, ఇష్టపడేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. డా.సౌమ్య గ్రేస్, మానసిక చికిత్స నిపుణురాలు, ఖమ్మం

జీవన నైపుణ్యాలతో రాణింపు..

తాము తీసుకునే నిర్ణయాల పర్యవసానాలను విద్యార్థులు తెలుసుకోలేరు. చిన్న విషయాలకూ తొందరపడతారు. వారి భావోద్వేగాల్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలి. ప్రవర్తనను బట్టి ఏది సరైన మార్గమో, ఏది సరైనది కాదో దిశానిర్దేశం చేయాలి. అప్పుడే ఒత్తిడి లేని మార్గంలో పయనిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్) బోధిస్తున్నాం. పాఠ్యాంశాలతో సమానంగా భావోద్వేగాల నియంత్రణ, సత్ప్రవర్తన, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్మీడియట్, డిగ్రీలో ఏ కోర్సులో చేరాలి? జీవిత లక్ష్యం ఎంపిక తదితర నైపుణ్యాలు అలవర్చుతున్నాం. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటి శిక్షణలు కొనసాగించాలి. స్వప్న, లైఫ్ స్కిల్స్ శిక్షకురాలు

# ఉక్కపోత.. వ్యాధుల బెడద

పెద్దపల్లి : వేసవి వెళ్లినా ఉక్కపోత తగ్గలేదు. ఓవైపు వేడి వాతావరణ పరిస్థితులు, మరోవైపు ఉక్కపోతలో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎక్కువ మంది నీరసం, మధుమేహం, రక్తపోటు తదితర సమస్యల బారిన పడటంతో పాటు దగ్గు, జలుబు, జ్వరాలతో బాధ పడుతున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడంతో వివిధ రకాల సమస్యలతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. వాతావరణ పరిస్థితులతో పెద్దపల్లిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా 450 నుంచి 500 వరకు నమోదవుతోంది. ఆస్పత్రిలోని జనరల్ వార్డులో చేరే వారి(ఇన్‌పేషెంట్ల) సంఖ్య కూడా కాస్త పెరిగింది. మొక్కుబడి పరీక్షలువైద్య సేవల కోసం వచ్చే రోగులకు మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నా రు. ల్యాబ్ టెక్నీషియన్‌కు బదులు సహాయకులే పరీక్షలు నిర్వహిస్తున్నా రనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రశ్నించినా పట్టించుకునే వారే లేకపోయారు. ఆసుపత్రిలో సాధారణ సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఓపీ విభాగంలో వైద్యులు అందుబాటులో లేక రోగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సదరు వైద్యులపై రోగులకు కనీస సమాచారం అందించే వ్యవస్థ కూడా లేదు. దిగువ స్థాయి సిబ్బంది ఇచ్చిందే మాత్ర.. చేసిందే చికిత్స.. అనే పరిస్థితి నెలకొంది. ప్రతి పనికీ ఓ ధరఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది డబ్బు వసూలు చేయడం పరిపాటంగా మారింది. వైద్య పరీక్ష స్థాయిని బట్టి డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారి నివేదికలు తప్పుల తడకగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. గర్భిణులకు అందించే సేవల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల భారాసకు చెందిన ఓ నాయకుడి భార్య ఆస్పత్రిలో పురుడు పోసుకుంది. ఈ సందర్భంగా వారం రోజుల్లో రూ.18 వేల చేతిచమురు వదిలిందని ఆయన వాపోయాడు. ఇదే పరిస్థితి ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎదురవుతోంది.

# గుర్తించరేం.. కూల్చరేం..!

నల్గొండ : శిథిల భవనాలు, ఇళ్లను.. అందులో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా చూడాలని పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తగు కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. కొన్ని పురపాలికల్లో శిథిల భవనాలు సర్వే చేశారు. మరికొన్నింటిలో పురపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు.

నిండుకున్న నిర్లక్ష్యం వానాకాలం ప్రారంభమైంది. వర్షాలు కురిస్తే శిథిలమైన గూడు ఎప్పుడు కూలుతుందో తెలియదు. చిన్నపాటి వర్షాలకే పాత పునాదులు తడిసి కూలుతున్నాయి. పురపాలికల్లో అధికారుల నిర్లక్ష్యంతో పాత ప్రహరీల కింద ప్రాణాలు పోతున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో యాదగిరిగుట్టలో రెండు అంతస్తుల భవనం బాల్కని కూలి నలుగురు ప్రాణాలు విడిచినా అధికారులకు కనువిప్పు కలగడం లేదు. రుతు పవనాలు రాకముందే శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సిన పుర యంత్రాంగం ఇంకా నిర్లక్ష్యం వీడటం లేదు. కాలం తీరిన భవనాలు, ఇళ్లు గుర్తించి కూల్చాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఐదు పట్టణాల్లో సర్వే..

తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు పురపాలికల్లో మాత్రమే శిథిల భవనాలపై సర్వే చేపట్టారు. అందులో నల్గొండ-16, భువనగిరిలో 66, ఆలేరు-4, చిట్యాల-3, హాలియా-3 చొప్పున పాతపడిన భవనాలను పుర అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. నకిరేకల్ పురపాలిక శిథిలావస్థకు చెందిన పాత భవనాన్ని కూల్చకుండా స్టోరూంగా వినియోగిస్తున్నారు. దాన్ని కూల్చి వేయకుండా, పట్టణంలో శిథిల భవనాలు తొలగించకుండా జాప్యం చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో ఇంకా శిథిల భవనాల గుర్తింపు సర్వే చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

నోటీసులతో సరి..!

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని 19 పురపాలికల్లో కిందటి ఏడాది శిథిల భవనాల సర్వే చేసి 286 పాత పునాదులను కూల్చాలని పుర అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో 69 భవనాలు మాత్రమే కూల్చారు. మరో 217 శిథిల భవనాలు, ఇళ్లు కూల్చకుండా వదిలేశారు. అందులో చాలా మంది గత్యంతరం లేక పాక్షికంగా మరమ్మతులు చేయించుకుని బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు.

కూల్చివేతలు ప్రారంభిస్తాం- రమణాచారి, కమిషనర్

నల్గొండలో ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తొలి విడత 16 శిథిల భవనాలు గుర్తించి నోటీసులు జారీ చేశాం. మరో విడత సర్వే కొనసాగుతుంది. భవనాల పటిష్టతను అనుసరించి ప్రమాదకరంగా మారిన భవనాలను కూల్చివేస్తాం. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటే ఆయా ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# నవపాలిక.. ప్రగతి దీపిక

నల్గొండ : నాలుగేళ్ల క్రితం పంచాయతీలుగా ఉన్న ప్రాంతాలో కొన్ని ప్రస్తుతం పురపాలక సంఘాలుగా రూపుదాల్చి అభివృద్ధి పథంవైపు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, మిర్యాలగూడ పట్టణాలు పురపాలికలుగా కొనసాగేవి. వీటికి తోడు దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాలు పురపాలికలుగా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2018 ఆగస్టు 2న చిట్యాల, హాలియా, నకిరేకల్, ఆలేరు, యాదగిరిగుట్ట, తిరుమలగిరి, నేరేడుచర్ల, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు, చండూరు, నందికొండ మొత్తంగా 12 పంచాయతీలను పురపాలికలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పంచాయతీలుగా ఉన్న సమయంలో అరకొర ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే పరిమితమైన నిధులతో వీటి పాలన నిర్వహణ భారంగా ఉండేది. పురపాలికలుగా ఏర్పడిన తర్వాత ఒకేసారి ప్రజలపై భారం మోపొద్దనే ఉద్దేశంతో మూడేళ్లపాటు పంచాయతీల పన్ను విధానాన్నే అమలుచేశారు. ఇళ్లు, ఇతరత్రా నిర్మాణాలకు అనుమతి ఇవ్వడానికి 30 రోజుల సమయం నుంచి 21 రోజులకు కుదించారు. అనుమతులు ఇవ్వడానికి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఏర్పాటైంది. 'టీఎస్‌బీపాస్'ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అవసరమైన అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే, గంటల్లోపే అనుమతులు లభిస్తున్నాయి. పంచాయతీలలో అమల్లో ఉన్న జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానంలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం కింద మహిళలు, నిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి అంశాలకు సంబంధించిన అవకాశాలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఆస్తి పన్ను, ప్రచార పన్ను, నీటిపన్ను, వ్యాపార, వినోదపు పన్ను, వాణిజ్య భవనాల లైసెన్సు పన్నులతోపాటు ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, పురపాలక సంఘం గ్రాంట్స్ రూపంలో పురపాలక సంఘానికి ఆదాయం పెరిగింది. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు, వీధిదీపాల నిర్వహణ, తదితర నిర్వహణ సిబ్బంది సంఖ్య కూడా పెరిగింది. ప్రధానంగా పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, నీటి సరఫరా విషయంలో సేవలు పెరిగాయి.

ప్రధానంగా నిధులు ఇలా..తెలంగాణ పట్టణ ఆర్థిక వనరుల అభివృద్ధి సంస్థ, షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక, ప్రత్యేక అభివృద్ధి నిధులు, పట్టణ ప్రగతి కింద మంజూరయ్యే నిధులతోపాటు ఎమ్మెల్యేలు మంత్రులు, ఎంపీల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకోవడంలో చొరవచూపుతున్నారు.

పనులు సాగుతున్న తీరు

చిట్యాల: పార్కు నిర్మాణం, ఓపెన్ జిమ్, వైకుంఠధామాలు(3), సమీకృత మార్కెట్ నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్లవెంట, ప్రధాన కూడళ్లలో మొక్కల పెంపకం, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ.

నేరేడుచర్ల: సెంట్రల్ లైటింగ్, ప్రధాన రహదారుల విస్తరణ, సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం.

నకిరేకల్: ప్రధాన రహదారి విస్తరణ, సమీకృతమార్కెట్, మినీట్యాంకు బండ్, వైకుంఠధామాల నిర్మాణం. హాలియా: అంతర్గత సీసీరోడ్లు, మురుగు కాల్వలు, సమీకృత మార్కెట్, వైకుంఠధామాలు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు ప్రారంభించాల్సి ఉంది.

యాదగిరిగుట్ట: పెద్దమురుగు కాల్వ, సీసీరోడ్లు, అంతర్గత మురుగుకాల్వలు, వైకుంఠధామం, సమీకృతమార్కెట్ నిర్మాణం. ఇందులో పెద్ద మురుగుకాల్వ, కి.మీ. పొడవునా నిర్మించిన సీసీ రోడ్డు ప్రధానమైన పనులు.

ఆలేరు: సెంట్రల్ లైటింగ్, సమీకృతమార్కెట్, బైపాస్‌లో బీటీ రోడ్డు, స్ట్రామ్ వాటర్ కాల్వలు, సీసీరోడ్లు, ప్రధాన, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం.

అభివృద్ధి పైనే దృష్టి..– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే నకిరేకల్

నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల పురపాలికల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రానున్న కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ప్రధానంగా దృష్టి సారించాను.

# పోషకాహారం.. విద్యార్థులకు ప్రయోజనకరం

కరీంనగర్ : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. బడి ప్రారంభానికి ముందు గంట, ముగిశాక మరో గంట నవంబరు చివరి వారం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఉదయం ఖాళీ కడుపులతో హాజరై మధ్యాహ్న భోజనం వరకు వేచి చూస్తూ.. తిరిగి సాయంత్రం పొద్దుపోయాక ఇంటికి వెళ్తున్న వారికి ఆకలి బాధలు తప్పడం లేదు. చదువుపై ఏకాగ్రత నిలిపేలా అన్ని బడుల్లో అల్పాహారాన్ని అందించే విషయంలో ప్రభుత్వం స్పందించింది. జిల్లాలో బుధవారం నుంచి ఈ కార్యక్రమం అమలవుతోంది. ఈ నేపథ్యంలో వారికి ఎలాంటి ఆహారం అందిస్తే మేలు చేకూరుతుందో డైటీషియన్ డాక్టర్ మెహర్ దీపతో మాట్లాడి ఇస్తున్న ప్రత్యేక కథనమిది. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున..ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల దాతల సహకారంతో, కరీంనగర్‌లో నగర పాలక సంస్థ ప్రత్యేక చొరవతో కొన్ని రోజులుగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఇటీవల స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నిత్యం రూ.15 చొప్పున



ఖర్చు చేసేందుకు నిధులు విడుదల చేసింది. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. రోజుకు జిల్లాలో రూ.63,705 వ్యయం కానుంది.

ఆరోగ్యకరమైనవి ఎంచుకుంటే మేలు..విద్యార్థులు ఒక పూట మధ్యాహ్న భోజనమే గాకుండా రెండు పూటలా వారు చదువుపై దృష్టి కేంద్రీకరించేలా తక్కువ ఖర్చుతో పోషక విలువలతో అల్పాహారాన్ని ప్రయోజనంగా ఉంటుందని డైటీషియన్ డాక్టర్ మెహర్ దీపక తెలిపారు. ఇందుకు అందుబాటులోని ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని తెలిపారు. ఆమె సూచించిన పలు అంశాలు ఇలా..మార్కెట్లో దొరికే పల్లీపట్టీలను ఇవ్వడం ద్వారా ఐరన్ లభిస్తుంది. ఆక్సిజన్ లెవల్స్ పెరుగుతాయి. అరటి పండ్లను ఇస్తే ఫ్యాట్స్ చేకూరుతాయి. పాలు, ఉడికించిన గుడ్లు ఇవ్వడం ద్వారా పోషక విలువలు చేకూరి విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలు వస్తాయి. తక్కువ ధరల్లో దొరికే సీజనల్ పండ్లను కూడా అందించవచ్చు. మొలకెత్తిన కంకులను అందించడం ఎంతో ప్రయోజనం. వాటి ద్వారా పీచు పదార్థాలు అందుతాయి. అలసట దూరమవుతుంది. క్యారెట్లు, బీటురూటు ఇవ్వడంతో విటమిన్లు చేకూరుతాయి. మొలకెత్తిన గింజలు పెడితే పోషకాలు అందుతాయి. ఒకే రకమైనవి కాకుండా రోజుకో పదార్థం పెడితే.. ఆరోగ్యంగా ఉంటారు. బిస్కెట్లు ఇస్తే అందులోని మైదా, వాటి తయారీలోని లోపాల మూలంగా విద్యార్థులకు ప్రయోజనం ఉండదు. బయట దొరికే సమోసలాంటి పదార్థాలతో ఒక్కోసారి ఇబ్బందులు వచ్చే అవకాశముంది.

# బతుకమ్మ చీరల ఆర్డర్లకు నిరీక్షణ

సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం బతకమ్మ పండుగ కానుకగా మహిళలకు అందజేసే చీరల డిజైన్ల ఎంపికలో జాప్యం వీడటం లేదు. ఏటా జనవరిలోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు వచ్చేవి. దీని కోసం జిల్లా చేనేత, జౌళిశాఖ ఇటీవల రెండు రకాల నమూనాలతో వివిధ డిజైన్లు సిద్ధం చేయించింది. వాటిలో ప్రింటెడ్ నమూనా బాగున్నా వాటి ఉత్పత్తిలో సిరిసిల్ల నేతన్న ప్రతిభకు పెద్దగా అవకాశం లేదు. కేవలం జరీ నూలు అంచుల్లో డిజైన్లు వస్తాయి. మిగతా అంతా వివిధ రకాల ప్రింటింగ్ డిజైన్లు ఉంటాయి. మరో రకంలో పూర్తిగా డాబీ, జకార్డ్ పరికరాలు అమర్చిన మరమగ్గాలపై (టైఅండ్‌డై) రంగులు అద్దిన నూలుతో వివిధ డిజైన్లుగా నిర్ణయించారు. ఈ రెండు నమూనాలను జిల్లా వస్త్ర పరిశ్రమలో తయారు చేయించి టెస్కోకు పంపారు. రెండో రకం డిజైన్ల ఉత్పత్తికి పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.వస్త్రోత్పత్తుల ఆర్డర్లు అంటే కేవలం కార్మికుల ఉపాధి కోసమే కాదు. వారిలోని నైపుణ్యాలను రాష్ట్రానికి పరిచయం చేయాలనేది ముఖ్య ఉద్దేశం. టైఅండ్‌డై నూలుతో తయారు చేసే చీరలు పట్టు చీరలను పోలి ఉంటాయి. వీటిని డాబీ, జకార్డ్ పరికరాలు అమర్చిన మరమగ్గాలపై ఉత్పత్తి చేస్తే ఆకర్షణీయమైన డిజైన్లు వస్తాయి. జిల్లా పరిశ్రమలో 30 వేల మరమగ్గాల్లో 14 వేల మరమగ్గాలు మాత్రమే డాబీ, జకార్డ్‌లు అమర్చి ఉన్నాయి. మూడేళ్ల క్రితం ఇలాంటి ఆర్డర్లు వచ్చాయి. వీటికోసం పరిశ్రమ వర్గాలు గుజరాత్, మహారాష్ట్ర, చెన్నైలోని



వస్త్ర పరిశ్రమల నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకొచ్చారు. వీటిని బిగించడంలో అప్పుడు కార్మికుల కొరత ఉండేది. ఈ సారి ఆర్డర్లు ముందు అందజేస్తే వీటిని సరిచేసుకోవడం, డిజైన్లకు తగ్గట్టుగా మార్చుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు జిల్లా పరిశ్రమలో అయిదు వేల మంది కార్మికులు మాత్రమే ఉన్నారు. వీటిపై పని చేసేందుకు అదనంగా కార్మికులు అవసరం. బతుకమ్మ చీరల ఉత్పత్తి సమయంలో ఝార?ండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి సుమారు రెండు వేల మంది కార్మికులు సిరిసిల్లకు వస్తారు.

నూలుపై భిన్నాభిప్రాయాలు

ప్రభుత్వం కోటి బతుకమ్మ చీరలకు రూ.350 కోట్లు బడ్జెట్ కేటాయించింది. వీటిలో ఉత్పత్తి వరకు రూ.250 కోట్లగా నిర్ణయించారు. అయితే చీరల ఉత్పత్తిలో వాడే నూలుపై పరిశ్రమ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వందశాతం పాలిస్టర్ నూలు వాడకంతో ఉత్పత్తిలో వేగం పెరుగుతున్నా.. వాటిని ధరించడంలో చాలా మంది విముఖత వ్యక్తం చేస్తున్నారు. చీరల ఉత్పత్తిలో పూర్తి పాలిస్టర్ నూలు కాకుండా కాటన్ నూలును కలపాలనే డిమాండ్ పరిశ్రమ వర్గాల్లో ఉంది. నేతన్న నైపుణ్యంతో తయారు చేసిన చీరలు మహిళలను ఆకట్టుకుని వాటిని ఉపయోగిస్తేనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గుర్తింపు వస్తుందనేది వస్త్రోత్పత్తిదారులు అభిప్రాయపడుతున్నారు. వారి వినతిని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయితే ఇప్పటికీ నూలుపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టత రాలేదు.

# బియ్యం భారం.. పప్పులు ఘోరం



వరంగల్ : గ్యాస్ బండను పక్కన పెట్టి కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఈ మహిళ కొర్లకుంటకు చెందిన పంతకాని లక్ష్మి.. గ్యాస్ ధర భారీగా పెరగడంతో అడవికి వెళ్లి తెచ్చుకొని కట్టెల పొయ్యిపైనే వంట చేసుకుంటున్నాం. గతంలో మూడు కిలోల వంట నూనె వాడేవాళ్లం.. ప్రస్తుతం కిలో నూనెతో నెలంతా సరిపెట్టుకుంటున్నామని ఆమె తెలిపారు.

పెరుగుతున్న ధరలతో సామాన్యుడికి బతుకు భారమైంది.. కిరాణ సరకుల నుంచి గ్యాస్, ఇంధనాలు ఇలా అన్ని ధరలు చుక్కల్లో ఉండటంతో ప్రతి నెలా కుటుంబ ఖర్చులు పెరిగిపోతుండటంతో ఎలా బతకాలో తెలియని పరిస్థితిలో పేద, మధ్య తరగతి ప్రజలున్నారు. నాలుగేళ్ల నాటి నిత్యావసరాల ధరలతో ప్రస్తుతం పోల్చి చూస్తే వ్యత్యాసం భారీగా పెరిగింది. బియ్యం పప్పులు, నూనెల ధరలు మండుతుండగా నెలనెలా ఇంటి ఖర్చులు పెరుగుతున్నాయి. కుటుంబాల ఆదాయం మాత్రం పెరగడంలేదు. నలుగురు కుటుంబ సభ్యులున్న ఒక్కో కుటుంబంపై బియ్యం రూపంలోనే ఏడాదికి రూ.2 వేలకు పైగా అదనపు భారం పడుతోంది. ప్రస్తుతం వంట నూనెల ధరలు స్వల్పంగా తగ్గినప్పటికి గతంతో పోల్చుకుంటే 70 శాతానికి పైగా, పప్పుల ధరలు 60 శాతానికి పైగా పెరిగాయి. ఈ లెక్కన దిగువ, మధ్య తరగతి ప్రజల ఇంటి ఖర్చులు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు అదనంగా పెరిగాయి. ఆసుపత్రి ఖర్చులు, బడి ఫీజులు అనివార్యమే.. ఇటీవల కాలంలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. సన్న రకం బియ్యం క్వింటాలు రూ.6 వేలను తాకింది. ప్రతి కిలో బియ్యంపై రూ.6 నుంచి 8 వరకు పెరిగింది. బియ్యం ధరలు ఈ స్థాయిలో పెరగడంపై జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంధన ధరలు పెరగడంతో ఆటో, బస్సు ఛార్జీలు పెరిగిన విషయం తెలిసిందే. నెల ఖర్చులు పెరగడానికి పెట్రోల్ ధరలు ప్రత్యేక్షంగా కారణమైతే.. పెరిగిన డీజల్ ధరలతో సరకు రవాణా ఛార్జీలు హెచ్చయి ధరలు పెరగడానికి పరోక్షంగా కారణమవుతోంది. అటు కరెంటు ఛార్జీలు షాక్ కొడుతున్నాయి.

మాంసం ధరలు పెరగడంతో కొంతమంది వారానికి ఒకసారి కాకుండా నెలకు ఒకసారి మాత్రమే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.. లేదా తక్కువ ధరలో లభించే చేపల వైపు మళ్లుతున్నారు.

గ్యాస్ ధరలు పెరగడంతో గ్రామీణ ప్రజలు అడవిలోని వంట చెరకు తెచ్చుకుంటున్నారు. లేదా కొనుగోలు చేస్తున్నారు. డబ్బు జమైనప్పుడు మాత్రమే గ్యాస్ బండలను కొనుగోలు చేస్తున్నారు. గ్యాస్‌ల వాడకం గణణీయంగా తగ్గినట్లు గ్యాస్ సరఫరా ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు.

మటన్ కొనడమే మానుకున్నాం..

-బాషిక సంపత్, వజినేపల్లి

పెరిగిన ధరలతో సంపాదించిన డబ్బుకు విలువ లేకుండా పోతోంది. రూ.వంద పెట్రోలు పోయించుకుంటే మూడు రోజులు వచ్చేది. ఇప్పుడు రెండు రోజులు కూడా రావడంలేదు. గతంలో కోడి మాసం నెలలో మూడు నాలుగు సార్లు తినే వాళ్లం ఇప్పుడు ఒకసారే తింటున్నాం. మటన్ కొనడమే మానుకున్నాం.

# మళ్లీ ఇన్‌స్పైర్ అవుదాం..!




వరంగల్ : పాఠశాల దశలోనే బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలనుకునే విద్యార్థులను ప్రోత్సహించే చక్కటి అవకాశం లభించింది. ఈ విద్యా సంవత్సరానికి (2022-23) సంబంధించిన ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల మంజూరు ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో ఈసారి 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులకు వారి ఖాతాల్లో రూ.10 వేలు త్వరలో జమకానున్నాయి. ఈ విద్యార్థులు సృజనాత్మక, వినూత్న ఆలోచనలతో తాము నమోదు చేసిన ప్రాజెక్టులను గైడ్ టీచర్ల సలహాలతో సిద్ధం చేయడానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాల్సి ఉంది. లక్ష్యం ఇదే..10 నుంచి 15 ఏళ్ల వయసు గల విద్యార్థుల్లో వినూత్న, సృజనాత్మక శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (డీఎస్‌టీ), గుజరాత్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (నిఫ్) సంయుక్తంగా ఈ పథకాన్ని దశాబ్ద కాలానికి పైగా అమలు చేస్తున్నారు. ప్రతి ఏటా పది లక్షల మంది విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే వారు ఈ పథకానికి అర్హులు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉత్తమ ఆలోచనలను పంపించవచ్చు. ప్రతి బడి నుంచి ఐదు వరకు నామినేషన్లు వేయవచ్చు. ఎంపికయిన ప్రాజెక్టుల తయారీకి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు జరుగుతాయి. అత్యుత్తమ ఆలోచనలతో ప్రాజెక్టును రూపొందిస్తే జాతీయస్థాయి పోటీ వరకు చేరుకునే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో 60 అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రపతి భవన్‌లో వాటి ప్రదర్శనను నిర్వహిస్తారు. జపాన్‌లో నిర్వహించే విజ్ఞాన యాత్రకు ఆ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో జిల్లాలోని విద్యార్థులు గత కొన్నేళ్లుగా ఈ పథకానికి ఎంపికవుతూ వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీల్లో తమ సృజనాత్మకతను చూపుతూ ప్రతిభను చాటుతున్నారు.

ఆ ఇద్దరి విజయం ఆదర్శం 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి పోటీలు గతేడాది సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాలోని కురవి మండలం బలపాల జడ్పీ పాఠశాల విద్యార్థిని నక్క భవానీ, పెద్దవంగర మండలం కొరిపల్లి యూపీఎస్ విద్యార్థి ఎడ్లనాని ప్రాజెక్టులు జాతీయస్థాయిలో ప్రతిభను చాటారు. అత్యుత్తమంగా ఎంపికయిన 60 ప్రాజెక్టుల్లో వీరిద్దరివి ఎంపిక కాగా అరుదైన విజయాన్ని సాధించి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. ఇకపై పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఆదర్శం కావడమే కాకుండా మార్గదర్శకులయ్యారు. నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొనే దోమల బెడద, వ్యర్థ పదార్థాలతో వ్యాధుల బారిన పడడం లాంటి రెండు సమస్యలకు వీరు వినూత్న ఆలోచనలతో పరిష్కారం చూపారు.

మరోసారి ప్రతిభ చాటాలి-బి.అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి

ఈ విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి దాదాపు వెయ్యి ప్రాజెక్టు నమూనాలను ఇన్‌స్పైర్‌కి నమోదు చేస్తే 70 ఎంపికయ్యాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే జాతీయస్థాయిలో ప్రతిభను చాటిన ఘనత మన జిల్లాకు ఉంది. అందువల్ల మరోసారి మనం ప్రతిభను చాటాలి. ఇందుకు గైడ్ టీచర్లు మరింతగా కృషి చేయాల్సి ఉంది. జూన్ తర్వాత జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనల పోటీలు ఉండే అవకాశం ఉంది. గతంలో మాదిరిగానే విద్యార్థులకు ఈ విషయంలో నిపుణులతో సూచనలు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

# హడావుడి పనులేనా?

వరంగల్ : కాళేశ్వర క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలకు మరో రెండు రోజుల సమయం ఉండగా భక్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నెల 17 నుంచి 19 వరకు ఉత్సవాలు జరగనుండగా.. తెలంగాణ, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. శివరాత్రికి భక్తులు ఏటా సమస్యలు తప్పడం లేదు. దేవస్థాన పరంగా ఒక్కొక్కటిగా పనులు నిర్వహిస్తుండగా ఇతర శాఖలకు చెందిన ఏర్పాట్లకు ఇంకా ముహూర్తం కుదరలేదు. ఉత్సవాలు సమీస్తుండగా హడావుడి పనులు చేసి మమ అనిపించడం పరిపాటిగా మారింది. శివరాత్రికి ఒక్క రోజు ముందు శుభానందదేవీకి స్వర్ణ కిరీటాన్ని అలంకరించనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు 2016, మే 2న స్వర్ణ కిరీటాన్ని బహూకరించగా పర్వదినాల్లో అమ్మవారికి అలంకరించిన అనంతరం భద్రత దృష్ట్యా బ్యాంకులో భద్రపరుస్తున్నారు. గోదావరి తీరం వద్ద తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణాలను ఇంకా చేపట్టలేదు. గతంలో తీరానికి ఎగువన స్థలంలో మరుగుదొడ్ల నిర్మాణం చేసేవారు. స్థలాల్లో గృహ నిర్మాణాలు జరగడంతో తీరం వద్ద స్థల ప్రభావం ఏర్పడింది.ప్రధాన ఆలయానికి పంచ రంగులు వేయడంతో శోభాయమానంగా కనిపిస్తోంది. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయాలు, రాజగోపురాలకు విద్యుత్ కాంతులు వెదజల్లేలా ముందస్తు ఏర్పాట్లు చేశారు.ఆలయ అధికారులు భక్తులను మూడు విధాలుగా విభజించారు. రూ.1000 చెల్లించిన వారికి గర్భగుడిలో అభిషేకాలతో పాటు లింగ స్పర్శ దర్శనం కల్పించనున్నారు. రూ.100 వారికి, సాధారణ భక్తులకు గర్భగుడి ప్రవేశం కల్పించనున్నారు. క్యూలైన్ల నిర్మాణాలను బుధవారం నుంచి చేపట్టనున్నారు. శివరాత్రి రోజున శని త్రయోదశి రావడం అరుదు, నవగ్రహ పూజలు నిర్వహించుకునే భక్తులకు ఆటంకం కలిగించకుండా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శని పీడిత భక్తులు పూజలు చేసుకునే వీలు కల్పించారు. ప్రధాన రహదారి వెంట ఉన్న గృహాల నుంచి మురుగు నీరు సంగమేశ్వర, దత్తాత్రేయ ఆలయం ముందుకు చేరుతోంది. మురుగు దుర్వాసనతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# తరగతి గదిలోనే వృత్తి నైపుణ్యం

ధర్మారం : విద్యార్థుల్లో చదువుతో పాటు జీవన నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ సొసైటీ పరిధిలోని 34 గురుకులాల్లో అమలు చేస్తున్న వృత్తివిద్యా కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. 2019లో గురుకులాల్లో వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టారు. ఇంటర్ స్థాయిలో హెల్త్ ఎడ్యుకేషన్, డెయిరీ, సెరికల్చర్, మార్కెటింగ్, కన్‌స్ట్రక్షన్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వైరింగ్, కమర్షియల్ గార్మెంట్స్, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఫ్యాషన్ గార్మెంట్స్, అగ్రికల్చర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, టైలరింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో ఇంటర్‌తో చదువు ఆపినా స్వయం ఉపాధి కల్పించుకునేలా ఈ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాయి.

320 మందికి శిక్షణ

ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టారు. మల్లాపూర్‌లో కమర్షియల్, గార్మెంట్స్ టెక్నాలజీ కోర్సు నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ డిజైన్లలో డ్రెస్సులు, మగ్గం వర్క్, బొమ్మల తయారీ, జువెలరీ మేకింగ్, పెయింటింగ్, ప్రింటింగ్ గురించి నేర్చుకుంటున్నారు. గర్రెపల్లిలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్, చింతకుంటలో ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్, బోయినపల్లిలో ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ



కోర్సులు బోధిస్తున్నారు. ఈ నాలుగు గురుకులాల్లో ఒక్కో చోట 80 మంది విద్యార్థులు మెలకువలు నేర్చుకుంటున్నారు. చదువు పూర్తి కాగానే త్వరగా స్థిరపడాలనుకునే వారికి వృత్తివిద్యా కోర్సులు దన్నుగా నిలవనున్నాయి. సత్వర ఉపాధి అవకాశాలుండటంతో వృత్తివిద్యా కోర్సులపై విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. ఆసక్తి కలిగిన పరిసర జిల్లాల విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది

ఫ్యాషన్ డిజైనింగ్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. భవిష్యత్తులోనూ ఉంటుంది. ఈ రంగంలో ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువే. వివిధ డిజైన్లలో డెస్సులు కుట్టడం నేర్చుకుంటున్నాం. మగ్గం వర్క్ చక్కగా నేర్పుతున్నారు. భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి పని నేర్పించగలనన్న నమ్మకం పెరిగింది. ప్రస్తుతం కొలతలు తీసుకోవడం వచ్చింది.

ఎ.పవిత్ర, ములుగు

ట్రెండుకు తగ్గట్టుగా డిజైన్లు

ఫ్యాషన్ రంగంలో రోజురోజుకూ కొత్త పోకడలు వస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా దుస్తులు, ఆభరణాల నుంచి ధరించే ప్రతి వస్తువునూ ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు శిక్షణ పొందుతున్నాం. దుస్తులతో పాటు ఆకర్షణీయమైన మెరుపు దారాలతో గాజులు, చెవులకు, ధరించే ఆభరణాలూ తయారు చేయడం నేర్చుకుంటున్నాం.

ఒ.శాంతి, మంచిర్యాల

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు

విద్యార్థులు శిక్షణపై ఆసక్తిగా ఉన్నారు. ప్రాక్టికల్ కావడంతో శ్రద్ధ చూపుతున్నారు. కోరుకున్న డిజైన్ తయారు చేసేలా బేసిక్స్ నేర్పిస్తున్నాం. ఏ వస్తువు తయారు చేసినా, డ్రెస్సులు కుట్టినా కొలతల నిష్పత్తిపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు తయారు చేసిన ఆభరణాలు, మగ్గం డిజైన్లను నచ్చిన వారు కొనుక్కుంటున్నారు. తద్వారా వచ్చిన డబ్బును శిక్షణకు, ముడిసరకుల కొనుగోలుకు వినియోగిస్తున్నాం.

ఎస్.వనజ, శిక్షకురాలు

# పరిరక్షణ మరచి.. పట్టనట్లుగా వ్యవహరించి..

సంగారెడ్డి : ప్రభుత్వ, అసైన్డు భూముల పరిరక్షణ రెవెన్యూ అధికారుల ప్రాథమిక విధి. నిబంధనల ఉల్లంఘన జరిగినా, ఎవరైనా కబ్జాలకు పాల్పడినా తక్షణం స్పందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. అయితే ఈ విషయంలో ఉదాసీన వైఖరి వల్ల కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్లలో ప్రభుత్వ, అసైన్డు భూముల్లో నుంచి వేసిన రోడ్డే ఇందుకు నిదర్శనం. గ్రామ పరిధిలో సర్వే సంఖ్య 98లో 168 ఎకరాల విస్తీర్ణ ముంది. ఇదంతా ప్రభుత్వభూమే. ఇందులో నుంచి 49 ఎకరాలను టీఎస్ఐఐసీకి కేటాయించారు. ఇందులో కొన్ని పరిశ్రమల నిర్మాణం సాగుతోంది. మరో 86 మంది రైతులకు సాగు చేసుకునేందుకు వీలుగా కొంత పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ, అసైన్డు భూముల మీదుగా 40 అడుగుల వెడల్పుతో అరకిలోమీటరుకు పైగా మట్టిరోడ్డు నిర్మిస్తున్నారు. ఇందులో కొంత మేర టీఎస్ఐఐసీకి కేటాయించిన స్థలం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చూసీచూడనట్లుగా అధికారులు

ఒక స్థిరాస్తి వ్యాపార సంస్థ ఈ రోడ్డు వేయడంతో పాటు కొంత మేర శిఖం భూములనూ కబ్జా చేస్తున్నారని గతంలో అధికారులకు ఫిర్యాదు లు అందాయి. ఈ అంశమై క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. రోడ్డు వేస్తున్న విషయం గురించి స్థానిక తహసీల్దారు పద్మావతిని అడగ్గా.. తనకు ఆ విషయం తెలియదన్నారు. తాము గతంలో అక్కడకు వెళ్లినప్పుడు రోడ్డు లేదన్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను ఆమె పంపించగా.. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆర్ఐ శ్రీనివాస్‌ను ఆదేశించమన్నారు. ఆర్ఐ శ్రీనివాస్‌తో మాట్లాడగా 20 ఏళ్లుగా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో రోడ్డుగా పేర్కొన్నారా? అని అడగ్గా అలాంటిదేమీ లేదన్నారు. వేరే వైపు నుంచి నక్ష రోడ్డు ఉందన్నారు. ప్రస్తుతం కొందరు మట్టి పోసి భారీస్థాయిలో వేస్తున్న రోడ్డు నక్ష బాట కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటినీ మరోసారి తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లగా అసైన్డు భూమిలో రోడ్డు వేయడం నిబంధనలకు విరుద్ధమేనన్నారు. ఒకవేళ అదే నిజమైతే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

అతిక్రమించిన వారికే వంతపాడేలా

ప్రభుత్వ, అసైన్డు భూములతో పాటు కొంత మేర టీఎస్ఐఐసీ భూముల్లో రోడ్డు వేసి చాలా రోజులైనా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా ఒకసారి తమ దృష్టికి రాలేదని, మరోసారి గతంలో రైతులు నడచుకుంటూ వెళ్లేవారని చెబుతున్న తీరూ ప్రస్తుతం అతిక్రమించిన వారికే వంతపాడుతున్నట్లుగా ఉంది. తమ భూమిలోనుంచి మట్టిరోడ్డు వేస్తున్నారని ఎవరైనా అసైన్డుదారులు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శ్రీనివాస్ అన్నారు. అసైన్డు భూములు పొందిన వారు నిబంధనలు ఉల్లంఘించినా, సాగేతర అవసరాలకు వాడుకున్నా రెవెన్యూ అధికారులే స్పందించి చర్యలు తీసుకోవాలి. ఇందుకు భిన్నంగా అధికారులు స్పందిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

# ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతం.. ప్రధాని మోదీ అభినందనలు



సూర్యుడి రహస్యాలు ఛేదించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 విజయవంతంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత తొలి మిషన్ విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. చంద్రయాన్-3 విజయం తర్వాత భారత్ తన అంతరిక్ష యాత్రను కొనసాగిస్తోందని అన్నారు. ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం విశ్వంపై అవగాహన పెంపొందించడానికి మన శాస్త్రవేత్తల అవిశ్రాంత ప్రయత్నాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

**ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతం :** సూర్యుడిపై పరిశోధనలకు భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం ఆదిత్య ఎల్-1 మిషన్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది.

తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ- సీ27 వాహకనౌక ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ఆదిత్య ఎల్1ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్నారు. రాకెట్ నుంచి విజయవంతంగా ఆదిత్య ఎల్1 విడిపోయినట్లు తెలిపారు.

ఈ ప్రయోగం విజయవంతమవడానికి సహకరించిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. దీంతో శ్రీహరి కోట షార్‌లో శాస్త్రవేత్తలు సంబురాలు చేసుకుంటున్నారు.

# నాన్నా.. మీ ఆశయాలే నన్ను చెయ్యిపట్టి నడిపిస్తున్నాయ్: సీఎం జగన్



గుంటూరు: దివంగత మహానేత వైస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావోద్వేగంగా స్పందించారు. "నాన్నా... మీరు లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిది" అంటూ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేశారాయన. భౌతికంగా మా మధ్య లేకపోయినా.. ప్రజల గుండెల్లో చిరకాలం జీవించే లీడర్ మీరు.

మీ పట్ల ప్రజలకున్న ప్రేమాభిమానాలు నాకు కొండంత అండగా నిలిచాయి. మీ ఆశయాలే సంక్షేమం, సమగ్రాభివృద్ధి లక్ష్యాల సాధనలో నన్ను చేయిపట్టి నడిపిస్తున్నాయి. వర్ధంతి సందర్భంగా మీకు ఘనంగా నా నివాళులు నాన్నా అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారాయన.

# వైఎస్సార్.. ఆ పేరు నేటికీ వినిపిస్తుంటుంది: గవర్నర్ అబ్దుల్ నజీర్




కృష్ణా: దివంగత మహానేత, ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ మేరకు శనివారం గవర్నర్ కార్యాలయం అధికారిక ఎక్స్(ట్విటర్) హ్యాండిల్ ఆయన సందేశం ఉంచింది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దార్శనికత కలిగిన నాయకుడు. రైతులు, పేద, అణగారిన వర్గాల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో ఆయన పేరుగాంచారు.

అందుకే ఆ పేరు నేటికీ వినిపిస్తుంటుంది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. ఆయన అమలు చేసిన ప్రజా-స్నేహపూర్వక సంక్షేమ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతారు అని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# వైయస్ఆర్ ఘాట్ వద్ద షర్మిల, విజయమ్మ నివాళి



ఇడుపులపాయ: కాంగ్రెస్ పార్టీలో వైతెపా విలీనంపై ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆచితూచి స్పందించారు. పార్టీ విలీనంపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఇది సరైన వేదిక కాదని ఇడుపులపాయలో అన్నారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా.. ఇడుపులపాయలో తల్లి విజయమ్మతో కలిసి షర్మిల నివాళులర్పించారు. వైయస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన తండ్రి జ్ఞాపకాలను షర్మిల గుర్తు చేసుకున్నారు. ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాజశేఖర్ రెడ్డిది అని చెప్పారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన మహానేత వైఎస్ అని కొనియాడారు. మహానేత మరణం తర్వాత రాష్ట్రంలో 700 మంది పేదల గుండెలు ఆగిపోయాయని గుర్తు చేశారు.

# వైఎస్సార్ ఎప్పటికీ మనతోనే ఉంటారు: సజ్జల



అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహానేతతో తమ జ్ఞాపకాలను నేతలు గుర్తుచేసుకున్నారు. కోట్లాది మంది ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సుస్థిరస్థానం సంపాదించుకున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ ఎప్పటికీ మనతోనే ఉంటారు. వైఎస్సార్ మనసున్న నాయకుడు. మనసుతో పాలన చేసిన మహానేత వైఎస్సార్. వైఎస్సార్ అడుగుజాడల్లోనే సీఎం జగన్ పాలన చేస్తున్నారని సజ్జల అన్నారు. "వైఎస్సార్, వైఎస్ జగన్ పాలనలో ఉండటం మన అదృష్టం. అందరూ బావుండాలని కోరుకునే వ్యక్తి వైఎస్సార్.

మనసున్న వ్యక్తి పాలకుడైతే ప్రజలు సంతోషంగా ఉంటారు" అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

**తిరుపతిలో..** సీఎం జగన్ సంక్షేమ పాలనలో రాష్ట్రంలో 60 శాతానికిపైగా ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా తుడా సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి భూమన నివాళులర్పించారు. వైఎస్సార్ మనల్ని విడిచి 14 ఏళ్లు అయినా ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేక పోతున్నారనీ, ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు.

**ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్: మంత్రి పెద్దిరెడ్డి –** వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా తిరుపతిలో క్యాంప్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

**ఎన్టీఆర్ జిల్లాలో..** ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కంట్రోల్ రూం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇంఛార్జి దేవినేని అవినాష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.




**తండ్రి జ్ఞాపకాలు తలుచుకుంటూ...** తన తండ్రి నందమూరి హరికృష్ణ 67వ జయంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ భావోద్వేగ పోస్ట్ చేశారు. ఆగస్ట్ 29, 2018లో రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించిన సంగతి తెలిసిందే. ఓ అభిమాని పెళ్లికి హాజరు కావడం కోసం నెల్లూరు జిల్లా కావలికి కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్తుండగా నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి సమీపంలో కారు రోడ్డు ప్రమాదానికి గురై ఆయన మరణించారు. నేడు ఆయన జయంతి. ఈ సందర్భంగా తండ్రి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తారక్, కల్యాణ్‌రామ్ ట్వీట్ చేశారు.

**"ఈ అస్తిత్వం మీరు.. ఈ వ్యక్తిత్వం మీరు.. మొక్కవోని ధైర్యంతో కొనసాగే మా ఈ ప్రస్థానానికి నేతృత్వం మీరు.. ఆజన్మాంతం తలుచుకునే అశ్రుకణం మీరే" అంటూ భావోద్వేంగా పోస్ట్ చేశారు.**

# జే అండ్ కో టాక్స్‌తో దెబ్బకు పారిపోతున్న పారిశ్రామికవేత్తలు



విజయవాడ: ఏపీలో జే అండ్ కో టాక్స్‌తో పారిశ్రామిక వేత్తలు బెంబేలెత్తి పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నారని జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ ఎద్దేవ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "జగన్ ప్రభుత్వాన్ని 2024లో బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నాకు దేవుడు తోడు ఉన్నాడు... మీ ఆశీస్సులు ఉన్నాయంటూ కళ్లబొల్లి మాటలు చెప్పడం జగన్‌కే సాధ్యం. జగన్ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోతే యువత భవిష్యత్ ఏమైపోవాలి. జగన్ ప్రభుత్వంపై నాకు ఎటువంటి వ్యక్తిగత ద్వేషం లేదు. రాష్ట్ర ప్రజలు, యువత, రైతన్నలకు అన్యాయం జరుగుతుంటే ఆవేదనతో మాట్లాడుతున్నాను. అభివృద్ధి అంటే బటన్ నొక్కడం కాదు...భవిష్యత్‌కు భరోసా ఇవ్వడం. రాష్ట్రంలో అప్పులు తప్ప... అభివృద్ధి లేదు. రాష్ట్ర అభివృద్ధిపై ఏ రోజైనా జగన్ ప్రభుత్వాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశ్నించారా. మేధావులుగా చెప్పుకొనే అరుణ్ కుమార్ జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎందుకు మాట్లాడరు. మీకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిపై చర్చకు రండి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించింది జగన్ ప్రభుత్వం. వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకం. బడుగు,బలహీన వర్గాలకు రాజ్యాంగం హక్కులు కల్పించింది. మీరు ఇచ్చే పథకాలు మాకు రాజ్యాంగం ప్రసాదించింది. జగన్ ప్రభుత్వం దళిత సంక్షేమం కోసం ఉన్న 26 పథకాలు రద్దు చేసింది. గ్రామాల్లో దళితులు ఇంకా రైతు కూలీలుగా ఉన్నారు. గ్రామాల్లో భూములు ...భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయి. రాష్ట్రంలో సంపద సృష్టించకుండా...అప్పులు తెచ్చి పప్పులు, బెల్లంగా పంచిపెడుతున్నారు. ఒక మూరు?డు ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ఎలా ఉంటుందో దానికి ముఖ్యమంత్రి జగన్ ఓ ఉదాహరణ. ప్రతి ఏటా విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ఏమైంది. ఎందుకు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయడం లేదు. జగన్ ప్రభుత్వంలో నో గ్యారంటీ...నో వారంటీ. జగన్‌కు ఇంకోసారి అవకాశం ఇస్తే ఇండియా మ్యాప్‌లో ఏపీ ఉండదు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. జగన్ హయాంలో రాష్ట్రం మరో బీహార్‌లా మారింది. రానున్న ఎన్నికల్లో జై భీమ్ భారత్ పార్టీ అన్ని ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో పోటీ చేస్తుంది. దోపిడీ, దగా ప్రభుత్వంగా మారిన వైసీపి పార్టీని ఓడించడమే జై భీమ్ భారత్ పార్టీ నినాదం. వై నాట్ 175 కాదు ముందు జగన్ పులివెందులలో గెలవగలడా. %=%5 జోన్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు. దేశంలోజమిలి ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఒకే ఎలక్షన్...ఒకే దేశం అనేది బీజేపీ ఎలక్షన్ స్టంట్ మాత్రమే" అని జడ శ్రవణ్ తెలిపారు.

# ఆంధ్రులు జగన్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారు



కాకినాడ: రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నాడు టీడీపీ జోన్ 2 సమావేశం కాకినాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి అచ్చెన్న హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో విధి విధానాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్న మీడియాతో మాట్లాడుతూ.. "ఐదుకోట్ల మంది ఆంధ్రులు జగన్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారు. వ్యవస్థలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి(%జవీ జీూ+ూచీ%) భ్రష్టు పట్టించారు. 60 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారు. వారానికొకసారి కేంద్ర ప్రభుత్వం, %=దీ×% నుంచి అప్పులు తెస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత 13 లక్షల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చారు. తెచ్చిన డబ్బును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారు. ఒక్క ఇసుక మీద 40 వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు. ఇసుక మీద దోచుకున్న ప్రతి రూపాయిని తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాకా మళ్లీ వసూలు చేసి పేదవారికి పంచుతాం" అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# ఏపీలో కరెంట్ కష్టాలు.. ఆ సంస్థ వల్లనే..




అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత, అవగాహన లేమి, చేతకాని తనంవల్ల కరెంటు కోతలు విపరీతంగా పెరిగాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. శనివారం నాడు ఆయన టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. "ఎన్నికలకు ముందు రైతులకు 9 గంటలు నిరాటంకంగా కరెంటు ఇస్తామని జగన్‌రెడ్డి(%జీుస్త్రుఱఅ =వఎఎఎ%) హామీలు ఇచ్చి నేడు రాష్ట్రంలో మూడు నాలుగు గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు కోతలతో కొట్టు మిట్టాడుతుంటే, సీఎం విద్యుత్ శాఖతో ఏనాడైనా సమీక్షించారా? పీపీఎల్ రద్దు చేయొద్దు, కొనసాగించాలని చంద్రబాబు కోరినా కమిషన్ల కోసం రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం చీవాట్లు పెట్టి.. నోటీసులు జారీ చేసినా బుద్ధి రాలేదు. ఎన్నికలకు ముందు కరెంటు చార్చీలు పెంచనని నంగనాచి కబుర్లు చెప్పి 8 సార్లు కరెంటు చార్జీలు పెంచింది మీరుకాదా? చంద్రబాబునాయుడు హయాంలో ఒక్కసారి కూడా కరెంటు చార్జీలు పెంచలేదు. కరెంటు కోతలతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాల్లో ఏపీని మొదటిస్థానంలో పెట్టిన ఘనత మీది. మిగులు కరెంటు రాష్ట్రంగా చేసి దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలిపిన ఘనత చంద్రబాబు ది. ఎండాకాలంలో కాస్తో కూస్తో కరెంటు కోతలుంటాయే మోగానీ, వర్షాకాలంలో కరెంటు కోతలు మీ అసమర్థ పాలనకు నిదర్శనం. పులివెందుల సబ్ స్టేషన్ ముందు రైతులు బైఠాయించి కరెంటు ఇవ్వమని అడిగినందుకు కేసులు పెట్టారు. అలా అయితే.. కరెంటు సరిగా ఇవ్వని ప్రభుత్వంపై ఎన్ని కేసులు పెట్టొచ్చు? మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మైన్స్ తవ్వుకోవడం, ఇసుక దోచుకోవడం తప్ప కరెంటు కోతల మీద ధ్యాస లేదు. రాష్ట్రం పవర్ హాలిడే ప్రకటించే స్థాయికి రాష్ట్రం వెళ్లడం దౌర్భాగ్యం. విద్యుత్ లేక ఆక్సిజన్ యంత్రాలు పనిచేయక ఆక్వా రంగం కుదేలైంది. రాష్ట్రమంతా చీకట్లో మగ్గుతుంటే.. తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్ దేదీప్యమానంగా వెలిగితే సరిపోతుందా? వైసీపీ నేతలకు జగన్ క్విడ్ ప్రోకో ద్వారా లబ్ధి చేకూర్చే పనులు చేయడం తప్పితే ప్రజలకు లబ్ధి చేకూరే పనులెప్పుడైనా చేశారా? దళితుడికిచ్చే 200 యూనిట్ల ఉచిత కరెంటు దళితవాడలో ఉంటేనే అని మెలికపెట్టి అన్యాయం చేయడం తగదు. దళిత బిడ్డల మేనమామ అని చెప్పి ఓట్లు వేయించుకొని దళితులకు తీరని అన్యాయం చేయడం సబబా? క్విడ్ ప్రోకో కింగ్ అయిన ముఖ్యమంత్రి ఏ కంపెనీ, ఏ కార్పొరేట్ సంస్థ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలి. హిందూజా కంపెనీ వారు ఆశించినంత ఇస్తారని క్విడ్ ప్రోకోకు పాల్పడుతున్నారా? హిందూజా కంపెనీకి 11 ఎకరాల భూమి క్విడ్ ప్రోకో కింద ధారాదత్తం చేసింది నిజంకాదా? కరెంటు కోతలు ఇలా ఉంటే చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితేంటి? ప్రజలు తాము చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి సమయం కోసం వేచి ఉన్నారని సీఎం గ్రహించాలి" అని వర్లరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 108 కాల్ సెంటర్ ఉద్యోగిపై మంత్రి విడదల రజనీ ఓఎస్డీ దాడి



గుంటూరు : మంగళగిరిలోని 108 కాల్ సెంటర్ ఉద్యోగిపై మంత్రి విడదల రజనీ ఓఎస్డీ దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆఫీస్‌లో అందరూ చూస్తుండగా ఉద్యోగి చెంపపై ఓఎస్‌డీ మదుసూధన్ రెడ్డి కొట్టారు. నిరసనగా నిన్న 15 నిమిషాల పాటు అత్యవసర కాల్స్‌ను నిలిపివేయడం జరిగింది. ఆరోగ్య శ్రీ అదనపు సీఈఓగా మధుసూధన్ రెడ్డి ఉన్నారు. మధుసూధన్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని 108 ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# ముప్పాళ్ల పోలీసు స్టేషన్‌లో వైకాపా నేతల వీరంగం.. ఎస్పైకి గాయాలు



ముప్పాళ్ల: పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి వైకాపా నేతలు వీరంగం సృష్టించారు. వైకాపా నేతల దాడిలో ముప్పాళ్ల ఎస్పై కిషోర్‌కు గాయాలయ్యాయి. తొలుత మద్యం మత్తులో వైకాపా నేత వెంకటేశ్వర్‌రెడ్డి కారుపై సాయి, కిషోర్ దాడి చేశారు. వైకాపా నేత ఫిర్యాదుతో వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆపై యువకులను అప్పగించాలంటూ అర్ధరాత్రి వైకాపా నేత అనుచరులు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లోనే వారు సాయి, కిషోర్‌పై దాడి చేశారు. అనుచరులను స్టేషన్ నుంచి బయటకు పంపేందుకు యత్నించిన ఎస్పైపై వైకాపా నేత వెంకటేశ్వర్ రెడ్డి దాడి చేశారు. ఈ ఘటనలో ఎస్పై కిషోర్ ముఖంతో పాటు చేతికి గాయాలయ్యాయి.

**పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా?: కన్నా :** ఈ ఘటనపై మాజీ మంత్రి, తెదేపా నేత కన్నా లక్ష్మీనారాయణ స్పందించారు. రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకపోతే ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దాడి చేసిన వైకాపా నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## మళ్లీ టోన్డ్ లెగ్స్‌తో కవ్విస్తున్న బుట్టబొమ్మ

తనదైన అందం నటనతో మంత్రముగ్ధులను చేసిన పూజా హెగ్డే ఇటీవల తెలుగు తెరకు దూరమైన సంగతి తెలిసిందే. మహేష్ సరసన అవకాశం వచ్చినా కానీ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. తన కాలికి తగిలిన గాయం ఇబ్బంది పెడుతుండడంతో ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుందని ప్రచారమైంది. ఏది ఏమైనా పూజా కాళ్ల గురించి పదే పదే యువతరం చర్చించుకునే సమయమిది. ఇంతకుముందు పూజా అందమైన టోన్డ్ లెగ్స్ గురించి సినీకవులు గొప్ప గేయాన్ని రాసారు. అల వైకుంఠపురములో చిత్రంలో మెజారిటీ పార్ట్ పూజా అందమైన టోన్డ్ లెగ్స్ పైనే దృష్టి సారించాడు



త్రివిక్రమ్. పూజా కాలి సౌందర్యాన్ని పొగిడేస్తూ బన్నీ సాంగేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు అదే కాలి సౌందర్యం లైఫ్‌స్టైల్ ఆసియా ఫోటోషూట్ కి యు.ఎస్.పి గా మారింది. దీంతో పూజా కాలి అందాల్ని ఎలివేట్ చేసేందుకు ఫోటోగ్రాఫర్లు పోటీపడ్డారు. పూజ ఫర్రి స్కర్ట్, పర్పుల్ క్రాప్ టాప్, పర్పుల్ లెదర్ జాకెట్‌తో కూడిన ఆల్-పర్పుల్ ఎన్‌సెంబుల్ లుక్ ఇప్పటికే వైరల్ అయింది. పూజ థై స్లిట్ డిజైనర్ లుక్ అంతే వైరల్ అయింది. ఇప్పుడు కాళ్ల సౌందర్యాన్ని ప్రదర్శిస్తున్న ఫోటోగ్రాఫ్ అంతర్జాలాన్ని చుట్టేస్తోంది. వంగ పువ్వు రంగు ఫెదర్ అటాచ్ మెంట్ తో డిజైన్ చేసిన ఈ యూనిక్ డ్రెస్ బుట్టబొమ్మ అందాన్ని పదింతలు పెంచిందని చెప్పాలి. ముఖ్యంగా పూజా టోన్డ్ లెగ్స్ సౌందర్యం మరో స్థాయిలో ఎలివేట్ అయ్యిందని కూడా చెప్పాలి. ఈ లుక్ చూశాక అభిమానులు లవ్ హార్ట్ ఫైర్ ఎమోజీలతో కామెంట్స్ సెక్షన్ లో వేడెక్కించేస్తున్నారు. పూజా అద్భుతమైన అవతార్‌ను చూసినందుకు చాలా మంది ఫ్యాన్స్ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పూజా చాలా అందంగా హాట్ గా ఉందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. రాధేశ్యామ్ - కిసీ కా భాయ్ చిత్రాల తర్వాత పూజా తదుపరి చిత్రానికి సంతకం చేయలేదు. తన కాలి గాయం మానేవరకూ ఎలాంటి రిస్కులు తీసుకోలేదని కూడా టాక్ వినిపిస్తోంది.

## అదీ సంగతి: పెళ్లి గురించి ఓపెనైన లైగర్ బ్యూటీ

పూరి లైగర్ చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది అనన్య పాండే. కానీ ఆ సినిమా డిజాస్టర్ అవ్వడం తనను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుతం బాలీవుడ్ లో పలు చిత్రాలతో బిజీగా ఉన్న అనన్య లవ్ లైఫ్ పెళ్లి ప్రణాళికల గురించి నెటిజనుల్లో డిబేట్ ఆసక్తిని కలిగిస్తోంది. అనన్య పాండే - ఆదిత్య రాయ్ కపూర్ గత సంవత్సరం కృతి సనన్ దీపావళి పార్టీలో కలిసి కనిపించినప్పుడు డేటింగ్ పుకార్లకు తెరలేచింది. ఆదిత్యతో సన్నిహితంగా ఉండే రణబీర్ కపూర్ A అక్షరంతో ప్రారంభమయ్యే ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని చెప్పడంతో ఆ ఇద్దరి రిలేషన్ షిప్ దాదాపుగా ఖరారైంది. అయితే ఈ డేటింగ్ పుకార్లను ఆ ఇద్దరూ ఏనాడూ అంగీకరించలేదు. కానీ ఒక ప్రముఖ వార్తా ప్రచురణ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనన్య ఇటీవల తన వివాహ ప్రణాళికల గురించి మాట్లాడింది. తాను పెళ్లి



చేసుకోవడానికి చాలా చిన్న వయస్సులో ఉన్నానని ప్రస్తుతం పెళ్లి గురించి ఆలోచనలు కానీ ప్రణాళికలు కానీ ఏవీ లేవని అనన్య తెలిపింది. దీంతో ఆదిత్య - అనన్య జంట డేటింగ్ వార్తలు నిరాధారమని స్పష్టత ఇచ్చినట్టయింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య ప్రస్తుతం తన తదుపరి చిత్రం డ్రీమ్ గర్ల్ 2 షూటింగ్ ను పూర్తి చేయడానికి ఢిల్లీలో ఉంది. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి సందడి చేయనుంది. వి.ఎఫ్.ఎక్స్ ని మెరుగుపరచడానికి మేకర్స్ మరింత సమయం కావాలని భావించడంతో సినిమా వాయిదా పడింది. జోయా అక్తర్ తదుపరి నిర్మాణంలోని చిత్రం ఖో గయే హమ్ కహాన్‌లో కూడా అనన్య కనిపించనుంది. ఇందులో గెహ్రైయాన్ సహనటుడు సిద్ధాంత్ చతుర్వేది - ది వైట్ టైగర్ ఫేమ్ ఆదర్శ్ గౌరవ్ లతో కలిసి నటించనుంది. విక్రమాదిత్య మోత్వానే చిత్రం సహా కరణ్ జోహార్ నిర్మిస్తున్న కాల్ మీ బే అనే వెబ్ సిరీస్ లోను నటించనుంది.





## మాస్ రాజా దమ్ దమ్ చేసేందుకు రెడీ..!




ధమాకా వాల్తేరు వీరయ్య రెండు హిట్లతో సూపర్ ఫాంలో ఉన్న రవితేజ ఆ తర్వాత వచ్చిన రావణాసుర సినిమాతో నిరాశ పరచాడు. ఈ సినిమా విషయంలో రవితేజ అంచనాలు తప్పాయి. సుధీర్ వర్మ డైరెక్షన్ లో తెరకెక్కిన రావణాసుర సినిమా తో హ్యాట్రిక్ మిస్ అయ్యాడు రవితేజ. ప్రస్తుతం టైగర్ నాగేశ్వరరావు సినిమా చేస్తున్నాడు మాస్ రాజా. వంశీ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. సినిమా నుంచి రీసెంట్ గా వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై భారీ క్రేజ్ వచ్చేలా చేసింది. రవితేజ సరసన నుపుర్ సనన్ హీరోయిన్ గా నటిస్తున్న టైగర్ నాగేశ్వరరావు సినిమాకు జివి ప్రకాష్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ఈ నెల 5న రిలీజ్ చేయనున్నారు. ఫస్ట్ సాంగ్ గా ఏక్ దమ్ ఏక్ దమ్ అనే మాస్ సాంగ్ రాబోతుంది. రవితేజ సినిమాల్లో సాంగ్స్ కూడా మాస్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తాయి. తన ప్రతి ఆల్బంలో అలాంటి సాంగ్స్ ఉండేలా చూసుకుంటాడు రవితేజ. ఈ క్రమంలో టైగర్ నాగేశ్వర రావు సినిమాలో కూడా ఏక్ ధం ఏక్ ధం అంటూ మంచి రెట్రో రొమాంటిక్ సాంగ్ తో వస్తున్నారు. ఏక్ ధం ఏక్ ధం సాంగ్ రిలీజ్ పోస్టర్ లో రవితేజ మాస్ లుక్ అదిరిపోయింది. హీరోయిన్ ని టీజ్ చేస్తూ రవితేజ యాటిట్యూడ్ ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తుంది. రిలీజైన పోస్టర్ లో నుపుర్ సనన్ థై షో అదిరింది. సో టైగర్ నాగేశ్వర రావు నిజమైన రూమర్స్ తో రూపొందిస్తున్న సినిమాగా స్టువర్టుపురం దొంగ టైగర్ నాగేశ్వర రావు కథతో వస్తుందని తెలుస్తుంది. సినిమా టీజర్ మేకింగ్ స్టామినా తెలియచేయగా సాంగ్ పోస్టర్ ఆడియన్స్ ని లాక్ అయ్యేలా చేస్తుంది. దసరా బరిలో దిగుతున్న టైగర్ నాగేశ్వరరావు సినిమాపై బజ్ ఓ రేంజ్ లో ఉంది. సినిమాతో రవితేజ స్టామినా పాన్ ఇండియా లెవెల్ లో చూపించాలని ఫిక్స్ అయ్యారు. రవితేజ కూడా ఈ సినిమా మీద ఫుల్ కాన్ ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ సినిమా తర్వాత రవితేజ ఈగల్ సినిమా చేస్తున్నాడు. అది కూడా 2024 సంక్రాంతికి వస్తుంది. ఆ తర్వాత గోపీచంద్ మలినేనితో మరో సినిమా ఉంటుందని తెలిసిందే. వాళ్లిద్దరు కలిసి ఆడియన్స్ కి మరో క్రాక్ ఇచ్చే ప్లానింగ్ లో ఉన్నారు.

## పొట్టి షార్ట్ లో అనసూయ ఘాటైన వర్కౌట్స్



ఈ మధ్య కాలంలో.. సోషల్ మీడియాలో మతి పోగొట్టే పరువాలతో అనసూయ హాట్ ఫోజులు పోస్ట్ చేయడం చూస్తూనే ఉన్నాం. ఆమె పోస్ట్ పెడితే చాలు దాన్ని ట్రెండ్ ట్రోల్ చేయడానికి కొంతమంది కాసుకుని కూర్చొని ఉంటారు.

అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ మరోసారి జిమ్ లో హాట్ వర్క ఔట్లు చేసిన ఫోటోలను పోస్ట్ చేసింది. ఆ వివరాలు.. బుల్లితెరకు అనసూయ దూరమైనప్పటికీ సోషల్ మీడియాలో వెండితెరపై ఎప్పుడు ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. రంగస్థలం పుష్ప లాంటి చిత్రాలు అనసూయకి నటిగా.. మంచి పేరును తీసుకొచ్చాయి. ఆమె చివరిసారిగా రంగమార్తాండ చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం పుష్ప 2 మరికొన్ని చిత్రాలతో బిజీగా ఉంది. పాత్ర నచ్చితే లేడి ఓరియెంటెడ్ చిత్రంలో నటించడానికి కూడా రెడీ గా ఉంటుంది. ఇక సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉండే అనసూయ.. గ్లామర్ ఆరబోతలో ఎప్పుడూ ముందుంతుంది. రీసెంట్ గా భర్తతో కలసి ఫుల్ గా థాయ్ ల్యాండ్ లో ఎంజాయ్ చేసిన అనసూయ అక్కడ దిగిన టూ పీస్ బికినీలో దిగిన హాట్ ఫొటోలను కూడా పోస్ట్ చేసింది. ఈ మధ్యనే దేశానికి తిరిగొచ్చి మళ్లీ సినిమాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అయితే అనసూయ భరద్వాజ్ ఈ మధ్య మళ్లీ కాస్త బొద్దుగా మారింది. దీంతో సినిమాల్లో మరింత ఫిట్ గా అందంగా కనిపించడం కోసం ఎక్కువ సమయాన్ని జిమ్లోనే గడుపుతోంది. అక్కడ చెమటోడ్చి మరీ వర్కౌట్లు చేస్తూ శ్రమిస్తోంది. వీటికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా పోస్ట్ చేస్తోంది. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఓ హాట్ ఫొటోను షేర్ చేసింది. ఇందులో ఆమె పొట్టి షార్ట్ వేసుకుని నేలపై కూర్చుంది. ఈ ఫొటోలో ఆమె థైస్ బాగా హాట్ గా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఈ పిక్ ఇంటర్నెట్లో సెన్సేషన్ గా మారింది.

## పాపం రష్మిక.. ఏదో అనుకుంటే, ఇంకేదో జరిగింది..!

నేషనల్ క్రష్ రష్మిక మందనా దక్షిణాదిన స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఛలో మూవీతో తెలుగులోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ ఇక్కడ స్టార్ హీరోయిన్ హెూదా దక్కించుకుంది. ఇప్పుడు బాలీవుడ్ లోనూ స్టార్ హీరోయిన్ గా ఎదిగేందుకు తన ప్రయత్నాలు తాను చేస్తోంది. వరసగా గుడ్ బై, మిషన్ మజ్నూ వంటి సినిమాల్లో నటించింది. ఆ సినిమాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది కానీ, పెద్దగా ఫలితం దక్కలేదు. అయితే, ఎలాగైనా బాలీవుడ్ లో మంచి స్థానం దక్కించుకోవాలని తాపత్రయపడుతోంది. దీనిలో భాగంగానే, ఆమె బాలీవుడ్ సినిమాల కోసం టాలీవుడ్ లో వస్తున్న ఆఫర్లను పక్కన పెడుతోంది. ఇటీవల నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్



లో ఓ సినిమా ఒకే అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో మొదటి నుంచి రష్మికనే హీరోయిన్ గా తీసుకోవాలని అనుకున్నారు. రష్మిక కూడా ముందు ఒకే చెప్పింది. కానీ, తర్వాత ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో కలిసి నటించే అవకాశం రావడంతో, ఆ సినిమా కోసం ఈ సినిమా ను వదులుకుంది. ఈ రెండు సినిమాలకు డేట్స్ కుదరకపోవడంతో ఆమె ఈ నితిన్ సినిమాను వదిలేసింది. షాహిద్ కపూర్ సినిమా కాబట్టి, బాలీవుడ్ లో మంచి క్రేజ్ వస్తుందని అనుకుంది.

కానీ, ఆమె ప్లాన్ రివర్స్ అయ్యింది. బడ్జెట్ సమస్యల కారణంగా షాహిద్ కపూర్ సినిమా మొదలుకాకముందే ఆగిపోయింది. ఈ సినిమా ఎప్పటికి మొదలౌతుందో ఎవరికీ తెలీదు. పాపం, ఏదో అనుకుంటే, ఇంకేదో అయ్యింది. ఈ లెక్కన ప్రస్తుతం రష్మిక చేతిలో పుష్ప2 తో పాటు, యానిమల్ సినిమాలు మాత్రమే ఉన్నాయి. ఈ సినిమాల్లో యానిమల్ షూటింగ్ ఎప్పుడో పూర్తైపోయింది. పుష్ప2 షూటింగ్ లో ఇటీవలే రష్మిక అడుగుపెట్టింది. ఈ రెండు సినిమాలు అయిపోతే, రష్మిక చేతిలో ఎలాంటి ప్రాజెక్ట్ లేనట్లే. అయితే, రీసెంట్ ఆమెకు షారూక్ తో నటించే ఓ ఆఫర్ వచ్చింది అంటూ వార్తలు వచ్చాయి. అయితే, ఈ విషయంలో ఇప్పటి వరకు అధికారిక ప్రకటన అయితే రాలేదు, ఒకవేళ నిజంగా షారూక్ తో ఆఫర్ వస్తే, రష్మిక మళ్లీ ఫామ్ లో కి వచ్చేస్తుంది.

## చిరుతో ఇంటరాక్షన్..శ్రీముఖికి కలిసొచ్చిందా?

శ్రీముఖి అలియాస్ బుల్లి తెర రామలమ్మ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. చిన్న తెరపై ఎంత కాపిటీషన్ ఉన్నా రాములమ్మ ప్రత్యేకత మాత్రం వేరు. యాంకర్లందరికంటే సమ్ థింగ్ స్పెషల్ అట్రాక్షన్ అమ్మడి సొంతం. తనలో ఆ రేర్ క్వాలిటీనే మిగతా వాళ్ల నుంచి వేరు చేస్తుంది. సరైనా సినిమా ఛాన్సులు పడలేదు..లేదంటే అక్కడా చిచ్చర పిడుగులా చెలరేగేది. అయినా అంది వచ్చిన ఏ అవకాశాని విడిచిపెట్టడం లేదు. తన లో హాట్ అప్పిరియన్స్ ని సందర్భం చిక్కినప్పుడల్లా ఇన్ స్టా వేదికగా షేర్ చేస్తూనే ఉంటుంది. అలాగే నటిగానూ సత్తా చాటే ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవలే నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తోన్న 108వ చిత్రంలో అవకాశం వచ్చిందని ప్రచారం సాగుతోంది. ఇందులో బాలయ్య కుమార్తె గా శ్రీలీల నటిస్తుండగా..ఆమె స్నేహితురాలి పాత్రకు శ్రీముఖి ఎంపికైటనట్లు తెలుస్తోంది. ఆద్యంతం ఆ పాత్ర సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా అనీల్ రావిపూడి డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తుంది.



ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు మెగాస్టార్ చిరంజీవి సినిమాలో సైతం ఛాన్స్ అందుకుందని కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. ప్రస్తుతం చిరు కథానాయకుడిగా మెహర్ రమేష్ దర్శకత్వంలో భోళా శంకర్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ కూడా పూర్తయింది. తాజాగా ఈ సినిమాలోనూ శ్రీముఖి ని కీలక పాత్రకు తీసుకున్నట్లు వినిపిస్తుంది. దీంతో శ్రీముఖి ఎంట్రీ వెనుక మెగాస్టార్ ఉన్నట్లు ఇన్ సైడ్ టాక్. చిరు సలహాతోనే శ్రీముఖి తీసుకున్నట్లు సన్నిహితుల నుంచి వినిపిస్తుంది. తొలి నటుల్లో ప్రతిభని గుర్తించి ప్రోత్సహించడంలో చిరు ముందుంటారు.

గాడ్ ఫాదర్ లో సత్యదేవ్ ప్రతి నాయకుడిగా ఛాన్స్ అందుకున్నారంటే దానికి కారణం మెగాస్టార్. సత్యదేవ్ అయితే ఆ పాత్రకు సరిగ్గా సూటవుతాడని భావించి ఎంపిక చేసారు. తాజాగా శ్రీముఖి ఎంట్రీ వెనుక అంతటి బలమైన కారణం ఉందని తెలుస్తుంది. ఆ మధ్య చిరంజీవిని సైతం శ్రీముఖి మాటల తో మెస్మరైజ్ చేసిన సంగతి తెలిసిందే. గాడ్ ఫాదర్ ప్రమోషన్ లో భాగంగా చిరుతో ఇంటరాక్ట్ అయింది. ఆ సమయంలో మెగాస్టార్ పై మాటల్లో చెప్పలేని అభిమానిన్ని కురిపించింది. చిరు సైతం అంతే ఎగ్జైట్ అయ్యారు. ఇలా అన్ని రకాలుగా శ్రీముఖికి కలిసొచ్చిందని ఇన్ సైడ్ వినిపిస్తున్న మాట.



# తుమ్మలతో పొంగులేటి భేటీ.. మాజీ మంత్రి నిర్ణయంపై వీడని ఉత్కంఠ

ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఖమ్మం రాజకీయం రసవత్తరంగా మారింది. భారాస టికెట్ దక్కకపోవడంతో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడుగులు ఎటువైపు అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఖమ్మంలోని ఆయన నివాసం వద్దకు భారీగా అభిమానులు చేరుకున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్దసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. తుమ్మల పార్టీ మారతారన్న ఊహాగానాల నేపథ్యంలో.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో తుమ్మలతో కాంగ్రెస్ నేత పొంగులేటి భేటీ అయ్యారు.

**పొమ్మనకుండా పొగ పెడుతున్నారు: పొంగులేటి** – ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తనను, మంత్రి అజయ్‌ను భారాసలోకి తుమ్మల నాగేశ్వరరావు తీసుకెళ్లారని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేయాలనే భారాసలో చేరినట్లు చెప్పారు. అప్పుడు తనను, ఇప్పుడు తుమ్మలను పార్టీ నుంచి వెళ్లగొట్టారని విమర్శించారు. పార్టీ నుంచి పొమ్మనకుండా పొగ పెడుతున్నారని ఆరోపించారు. తుమ్మలను, ఆయన అనుచరులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

**సీతారామ ప్రాజెక్టు కోసమే పోటీ..** అనుచరులు, అభిమానులతో చర్చించి పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకుంటానని తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనను ఆహ్వానించిందని.. అయితే అభిమానుల అభిప్రాయానికనుగుణంగా నడుచుకుంటానన్నారు. ప్రజల సహకారంతో ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరాలని పొంగులేటి ఆహ్వానించారన్నారు.

సీతారామ ప్రాజెక్టులోకి గోదావరి జలాల విడుదల చూడాలన్నది తన లక్ష్యమని వివరించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అయితే, ఏ పార్టీ నుంచి పోటీ చేస్తానన్నది తుమ్మల ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

# విజయవంతంగా కక్ష్యలోకి ఆదిత్య ఎల్1.. హర్షం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం 'ఆదిత్య ఎల్1' ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో అంతరిక్ష పరిశోధనా రంగంలో మరో కీలక మైలురాయిని దాటింది అని సీఎం పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా దేశ శాస్త్రవేత్తలు సాధిస్తున్న ప్రగతి, ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1స్పేస్‌క్రాఫ్ట్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్నది. విజయవంతంగా పీఎస్ఎల్వీ సీ57 నుంచి ఆదిత్య వేరుపడింది. దీంతో మిషన్ సక్సెస్ అయినట్లు ఇవాళ ఇస్రో ప్రకటించింది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్1 పాయింట్ దిశగా ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ తన జర్నీ మొదలుపెట్టినట్లు ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. సుమారు 1.04 నిమిషాల తర్వాత రాకెట్ నుంచి వేరుపడిన ఆదిత్య ఎల్1 కక్ష్యలోకి చేరింది. ఉదయం 11.50 నిమిషాలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. నిర్దేశిత కక్ష్యలోకి ఆదిత్య ప్రవేశించినట్లు ఇస్రో తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పేర్కొన్నది. ఎల్1 పాయింట్ దిశగా ఆదిత్యుడి సౌరయానం మొదలైనట్లు వెల్లడించింది.


# ఢిల్లీలో, గల్లీలో మోకరిల్లడమే కాంగ్రెస్ పార్టీ నైజం.. ఎమ్మెల్సీ కవిత ఫైర్



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుం ట్ల కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేస్తున్న హస్తం పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. తెలంగాణ అభివృద్ధికి అడ్డుగా మారిన కాంగ్రెస్ నాయకులపై విరుచుకుపడ్డారు. అప్పుడు ఢిల్లీ.. ఇప్పుడు ఢిల్లీ.. కానీ ఇప్పుడు వయా బెంగళూరు అం టూ కవిత తన ట్వీట్‌లో పేర్కొన్నారు. బెంగళూరు కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తుందని పేర్కొంటూ డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి కలిసి ఉన్న ఫోటోను కవిత షేర్ చేశారు.


కాంగ్రెస్ పార్టీ అంటేనే తె లంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టడం అని ధ్వజమెత్తారు. ఢిల్లీ, గల్లీలలో మోకరిల్లడం కాంగ్రెస్ పార్టీ నైజం అంటూ ఆమె నిప్పులు చెరిగారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాల్లో ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు ఉన్నాయా? : మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి : రాష్ట్రంలోని కొంత మంది నాయకులు డబుల్ ఇంజిన్ అని మాట్లాడుతున్నారు.. అసలు డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాల్లో ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు ఉన్నాయా? అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కొన్ని రాజకీయ పార్టీల జీవితమంతా ధర్నాలే అని ప్రతిపక్షాలను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. పేద ప్రజలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ బీఆర్ఎస్ సర్కార్ మాత్రం పేదలను గుండెల్లో పెట్టి చూసుకుంటుందన్నారు. ఇవాళ ప్రతిపక్షాలు అనేక రకాల మాటలు చెప్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నాయి. మీరు ఆలోచించండి.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి కార్యక్రమం తెచ్చింది కేసీఆర్ కాదా..? కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. బస్తీ దవఖానాల్లో పేద రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ఉచితంగా మంచినీళ్లు అందిస్తున్నాం. గత ప్రభుత్వాల హయాంలో నల్లా బిల్లు కట్టకపోతే తెల్లారేసరికి కనెక్షన్ కట్ చేసేవారు. కేసీఆర్ హయాంలో మంచినీళ్లు అందించాం. ధర్నాలు లేనే లేవు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు మాటలు చెప్పారు.. కానీ చేసి చూపించలేదు అని మంత్రి మండిపడ్డారు. ఇవాళ పనిచేసే వారెవరో, మాటలు చెప్పే వారెవరో దయచేసి ఆలోచించాలి. కొందరు డబుల్ ఇంజిన్ అని మాట్లాడుతున్నారు. డబుల్ ఇంజిన్ గవర్నమెంట్లలో ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టారా? కలలోనైనా ఊహించారా? డబుల్ ఇంజిన్‌లు అన్ని ట్రబులే తప్పా అక్కడ డబుల్ బెడ్రూం ఇండ్లు లేవు. ఈ దేశంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ, మన ముఖ్యమంత్రి కేసీఆర్. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా, రూ. 70 లక్షల విలువ చేసే ఇండ్లను మీ చేతుల్లో పెడుతున్నాం. దయచేసి ఈ ఇండ్లను అమ్ముకోవద్దు. ఈ ఇండ్లలో పది కాలాల పాటు ఆత్మగౌరవంతో ఉండాలి. మీరందరూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను దీవించాలని కోరుతున్నాను. ఎన్నికల ముందు అనేక రాజకీయ పార్టీల నాయకులు వస్తారు.. అందమైన నినాదాలు ఇస్తుంటారు. మనకు కావాల్సింది నినాదాలు కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రభుత్వం కావాలి. ప్రజల కలలను నిజం చేసే నాయకుడు కేసీఆర్ మాత్రమే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# జీహెచ్ఎంసీ పరిధిలో 11,700 వందల ఇండ్ల పంపిణీ



హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో 11, 700 వందల ఇండ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. కుత్బుల్లాపూర్ బహాదూర్‌పల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలోమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో డి- పోచంపల్లి, గాజులరామారం, బహదూర్ పల్లి కలిపి 17 వందల ఇండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వివేకానంద, మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు గ్రేటర్‌లో 9 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ళ పంపిణీ కొనసాగుతోంది.

అయితే డబుల్ బెడ్ రూం పంపిణీ పారదర్శకంగా జరగట్లేదంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో భారీగా పోలీసులు మోహరించారు.

డబుల్ బెడ్ రూంల కోసం 7 లక్షల మంది దరఖాస్తుదారులు అప్లై చేసుకోగా.. 95 వేల మంది లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించింది. కేవలం 13% మందికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




దిల్లీ: చంద్రయాన్–3 విజయం ఇచ్చిన జోష్‌తో భారత అంతరిక్ష సంస్థ సూర్యుడి సమీపంలో పరిశోధనలు నిర్వహించేందుకు సిద్ధమైంది. అందుకోసం ఆదిత్య–ఎల్1ఉపగ్రహాన్ని ప్రయోగిస్తోంది. ఈ సమయంలో అంతరిక్ష పరిశోధనల్లో దూసుకెళ్తున్న భారత్‌కు అంతర్జాతీయంగా ప్రశంసలు దక్కుతున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం మాజీ కమాండర్ క్రిస్ హడ్‌ఫీల్డ్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తోన్న విజయాలను కొనియాడారు. ఈ భూమిపై ప్రతిఒక్కరు సాంకేతికతపై ఆధారపడి ఉన్నారని వ్యాఖ్యానించారు. 'సూర్యుడి గురించి మరింతగా అర్థం చేసుకునేందుకు, దాని నుంచి ఎదురయ్యే ముప్పులను పసిగట్టేందుకు ఆదిత్య–ఎల్1 వంటి ప్రయోగాలు ఉపకరిస్తాయి. భూమిపై ఉన్న ప్రతిఒక్కరు సాంకేతికతపై ఆధారపడి ఉన్నారు. ఎలక్ట్రిక్ గ్రిడ్, ఇంటర్నెట్ గ్రిడ్, రోదసిలోని ఉపగ్రహాలు, వ్యోమనౌకలను సమర్థంగా రక్షించుకోవడానికి ఈ ప్రయోగం కీలకం కానుంది. ఈ భూమండలంపై సూర్యుడి ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి దోహదం చేస్తుంది' అని వెల్లడించారు.

అలాగే ఆయన భారత్ సాంకేతికంగా సాధిస్తోన్న పురోగతిని కొనియాడారు. ఇక ఇటీవలి చంద్రయాన్–3 ప్రయోగం గురించి స్పందిస్తూ.. అభివృద్ధి చెందుతోన్న భారత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రయోగం తేటతెల్లం చేసిందని ప్రశంసించారు. ఇది భారత్‌తో పాటు ఈ ప్రపంచానికి ఒక గర్వించదగ్గ క్షణమని అన్నారు.

**ఆదిత్య విజయం కోసం హోమాలు, పూజలు..** ఆదిత్య–L1విజయం కోసం దేశవ్యాప్తంగా పలు ఆలయాల్లో హోమాలు, పూజలు జరుగుతున్నాయి. వారణాసిలోని ఆలయంలో హోమం నిర్వహించారు. మరోపక్క ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పలువురు ఔత్సాహికులు సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)కు చేరుకుంటున్నారు. చంద్రయాన్–3 విజయం తమకు అంతరిక్ష కార్యక్రమాలపై ఆసక్తిని కలిగించిందని వారు పేర్కొన్నారు.




కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈకేసులో ప్రధాన నిందితులు చందన, ఆమె ప్రియుడేనని తేల్చారు. శనివారం జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్ మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. "ఆర్మూరు–బాల్కొండ రోడ్‌లో నిందితులు కారులో వెళ్తున్నారనే సమాచారంతో కోరుట్ల సీఐ ప్రవీణ్ సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు. నిందితులను విచారించగా నేరం అంగీకరించారు. దీప్తి చెల్లెలు బంక చందన 2019లో హైదరాబాద్‌లో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ జాయిన్ అయ్యారు. రెండేళ్ల తర్వాత డిటెయిన్ అయ్యారు. అదే కాలేజీలో చదివిన హైదరాబాద్‌కు చెందిన ఉమర్ షేక్ సుల్తాన్ చందనకు పరిచయమయ్యారు. పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుందామనుకున్నారు. గత నెల 19న ఉమర్ కోరుట్ల వచ్చి చందనతో పెళ్లి విషయం మాట్లాడాడు. ఇద్దరం లైఫ్‌లో సెటిల్ కాలేదు.. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు కావాలని ఉమర్ చెప్పాడు. ఆ తరువాత ఉమర్‌కు కాల్ చేసి చందన.. ఇంట్లో ఎవరూ లేరూ నేను మా అక్క మాత్రమే ఉన్నాం.. కోరుట్ల రావాలని చెప్పింది. దీంతో ఉమర్ 28వ తేదీ ఉదయం కోరుట్ల చేరుకున్నాడు. పథకం ప్రకారం చందన.. దీప్తి కోసం వోడ్కా , బ్రీజర్ తెప్పించింది. సోమవారం రాత్రి తండ్రి శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత అక్కతో కలిసి వోడ్కా తాగి పడుకుంది. దీప్తి నిద్రలోకి జారుకున్న తర్వాత .. ఉమర్‌కు ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చాడు. చందన, ఉమర్ కలిసి ఇంట్లో బీరువాలో ఉన్న నగదు, బంగారం తీస్తుండగా దీప్తి చూసి కేకలు వేసింది. అరవకుండా దీప్తి మెడకు చున్నీ చుట్టి వెనక్కి లాగారు. అయినా అరుస్తుండటంతో ఉమర్, చందన గట్టిగా పట్టుకుని.. దీప్తి ముఖానికి చున్నీ చుట్టి, మూతి, ముక్కుకు ప్లాస్టర్ వేశారు. 10 నిమిషాల తర్వాత ఆమెలో చలనం లేదు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న రూ.1.20లక్షల నగదు, 70తులాల బంగారం తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారు. వెళ్లిపోయే ముందు మూతికి చుట్టిన ప్లాస్టర్ తీసేసి సహజ మరణంగా చిత్రీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయారు. నాగ్‌పూర్ వెళ్లి స్థిరపడేందుకు బయల్దేరారు. ఈ క్రమంలో ఆర్మూర్ రోడ్డులో శనివారం ఉదయం నిందితులను అరెస్టు చేశాం. ఈ కేసులో ఏ1 చందన, ఏ2 ఉమర్ షేక్ సుల్తాన్ (అడ్డగుట్ట ప్రగతినగర్, హైదరాబాద్), అతని తల్లి సయ్యద్ అలియా, షేక్ అసియా ఫాతిమా, హఫీజ్‌ను అరెస్టు చేశాం. నిందితుల నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నాం" అని ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# పార్టీ విలీనంపై షర్మిల ఆసక్తికర కామెంట్




కడప: వైఎస్సార్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల స్పందించారు. శనివారం దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయకు వచ్చిన షర్మిల... తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో పార్టీ విలీనంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వైఎస్సార్టీపీ పార్టీ విలీనంపై మాట్లాడేందుకు ఇది వేదిక కాదని తెలిపారు. 14 ఏళ్లైనా ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ ఇంకాబ్రతికే ఉన్నారన్నారు. వైఎస్ అద్భుతమైన పథకాలు ద్వారా కోట్లమంది ప్రజల గుండెల్లో ఉన్నారని తెలిపారు. రైతు పక్షపాతిగా ఉండి విద్యుత్ బకాయిలను మాఫీచేసి, ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన మహానేత అంటూ కొనియాడారు. మహిళలకు పావలా వడ్డీ ద్వారా ఎన్నో కుటుంబాలలో వెలుగు నింపారన్నారు. పేద విద్యార్థులకు ఏ చదువు చదవడానికైనా ఫీజ్ రీఎంబర్స్‌మెంట్ పెట్టారన్నారు. 108, ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది ప్రాణాలు నిలిపారన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ చనిపోయినప్పుడు ఆ బాధ తట్టుకోలేక 700 మంది గుండె ఆగిందన్నారు. వారి కుటుంబాలకు కూడా ప్రగాఢ సంతాపం తెలియచేస్తూ వైఎస్సార్ బిడ్డగా వారి త్యాగాలు మరిచిపోనని వైఎస్ షర్మిల తెలిపారు.

# ఎన్నికల ముందు కేసీఆర్ సర్కార్ తమాషాలు చేస్తోంది



హైదరాబాద్ : డబుల్ బెడ్రూం ఇళ్ళు నిర్మించటంలో ప్రభుత్వం విఫలమైందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. అర్హులు కానీ.. బీఆర్ఎస్ వాళ్ళకే డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇస్తున్నారన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ సర్కార్ తమాషాలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులతో ఇళ్ళు నిర్మించి.. తాము నిర్మించినట్లు బీఆర్ఎస్ చెబుతోందన్నారు. కేసీఆర్ హాయాంలో రాష్ట్రం మత్తుల తెలంగాణగా మారిందన్నారు. గోషామహాల్ నియోజకవర్గంలో అర్హత లేని అనేక మందికి ఇళ్ళు ఇచ్చారని రాజాసింగ్ పేర్కొన్నారు.

# తెలంగాణలో మూడురోజులు భారీ వానలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ..!

రాగల మూడు రోజుల్లో తెలంగాణవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పలుజిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. సోమవారం నుంచి మంగళవారం వరకు పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని, పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వివరించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com